ANN తెలుగు

Follow: @ANNTELUGU

27-06-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 175 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM









**మంత్రి జూపల్లి స్ఫూర్తితో..**


వెంకటరమణకు రూ.75 వేల ఆర్థిక సాయం అందించిన కంది శ్రీనివాసరెడ్డి 06

టాప్ న్యూస్

రష్యాపై విరుచుకుపడ్డ

**ఉక్రెయిన్**

660 డ్రోన్లతో భారీ దాడి



02

**తెలంగాణకు నితిన్ నబిన్**


- మూడురోజులు ఇక్కడే మకాం
- జూన్ 28–30 వరకు మూడు రోజుల పాటు తెలంగాణలో నితిన్ నబిన్ పర్యటన.



02

**బాహుబలి3 కమింగ్**

- బిగ్ అప్ డేట్ ఇచ్చిన ప్రభాస్
- ప్రభాస్, రానా, అనుష్క కలిసి అభిమానులకు సర్‌ప్రైజ్



02

# కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

**సీఎంవో ప్రక్షాళన.. అజిత్ రెడ్డి ఔట్.. శ్రీధర్ ఇన్**

- సీఎం సలహాదారుగా రామకృష్ణారావు
- వచ్చే ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా రేవంత్ మార్క్ కూర్పు
- సమర్థుల ఎంపికకు.. కసరత్తు



**హైదరాబాద్, మహా** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం అయ్యారు. ప్రస్తుత సీఎస్ కే రామకృష్ణారావు.. ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనుండగా.. ఆ తర్వాత సంజయ్ జాజు ఆ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రేసులో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు వినిపించినా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గింది. సీఎస్ నియామకంతో పాటు సీఎంవోలోనూ కీలక మార్పులు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చే రెండున్నరేళ్ళను, ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని పాలనను పరుగెత్తించే వ్యూహంతో శ్రీధర్ ను సీఎంవో ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అజిత్ రెడ్డికి సీఎంవో నుండి ఉద్వాసన పలికి ఇన్వెస్ట్ మెంట్ సీఈవోగా నియమించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్, విపత్తు నిర్వహణశాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను నియమించారు. సీఎం సలహాదారుగా రామకృష్ణారావు పదవీవిరమణ తర్వాత

మిగతా 2వ పేజీలో

# మోదీ 3.0 కేబినెట్ పునర్వ్యవస్థీకరణ

**ఆర్థికమంత్రిగా శక్తికాంతదాస్?**

- విద్యాశాఖకు నిర్మల? కిషన్ రెడ్డికి ప్రమోషన్
- తెలంగాణ, ఏపీల నుండి మరొకరు
- నితీష్ కుమార్ కు కీలకశాఖ.. రామ్మోహన్ నాయుడు శాఖ మారే అవకాశం
- జాతీయ రాజకీయాల్లో సరికొత్త మార్పులు



**ఢిల్లీ, మహా** : దేశ రాజధాని న్యూఢిల్లీ కేంద్రంగా జాతీయ రాజకీయాల్లో కీలకమైన పరిణామాలు వేగంగా ఊపందుకుంటున్నాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి పగ్గాలు చేపట్టిన తర్వాత భారీ స్థాయిలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సర్వం సిద్ధమైంది. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం నాడు, ఆ తర్వాత కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గురువారం నాడు రాష్ట్రపతి భవన్‌లో మహామాన్య రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో అత్యంత ప్రాధాన్యత కలిగిన సమావేశాలు నిర్వహించారు. నూతన మంత్రుల ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ముహూర్తాలను ఖరారు చేయడమే లక్ష్యంగా సాగిన ఈ ఉన్నత స్థాయి భేటీల ఆధారంగా, జూన్ 28 లేదా జూన్ 29వ తేదీలలో కొత్త కేబినెట్ కొలువు దీరడం ఖాయమని తెలుస్తోంది. రాబోయే కాలంలో ఎదురుకానున్న సార్వత్రిక,

మిగతా 2వ పేజీలో



# అర్హులది ఒక్క ఓటు కూడా పోవొద్దు

ఎస్ఐఆర్ పై కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో అవగాహన

హాజరైన కౌన్సిలర్లు,కౌన్సిలర్ కంటెస్టెడ్ నాయకులు

బాధ్యతగా పనిచేయాలని సూచన 06



## మాదకద్రవ్యాల మాఫియాపై ఉక్కుపాదం

నషా ముక్త్ భారత్‌కు నాంది

అమిత్ షా కొత్త వ్యూహం 02





# డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

**చిన్నారుల భవిష్యత్తే తెలంగాణ ప్రగతి**

**టాలీవుడ్ ప్రముఖులు 'సే నో టు డ్రగ్స్' సందేశాలు ఇవ్వాలి**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, మహా :** చిన్నారుల భవిష్యత్తే ఈ రాష్ట్ర భవిష్యత్తు. వాళ్ళు ఎంతగా వృద్ధిలోకి వస్తే, తెలంగాణ రాష్ట్రం అంతగా అభివృద్ధి చెందుతుందని అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, అక్రమ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలంగాణలో ఏ ఒక్కరూ మాదక ద్రవ్యాలకు బానిస కాకూడదన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర క్యాబినెట్ యావత్తు సంకల్పమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మకాలకు గానీ, సరఫరా అనే మాటకే గానీ తావుండకూడదని తేల్చిచెప్పారు.ఆరోగ్యవంతమైన యువతను తయారుచేసే

మిగతా 2వ పేజీలో

**త్వరలో పట్టాలెక్కనున్న 'రైతు డిస్కం'**

తుది దశకు లైసెన్సు జారీ ప్రక్రియ 03






# కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

( మొదటి పేజీ తరువాయి )

బాధ్యతలు చేపట్టనున్నారు. సంజయ్ జాజు, శ్రీధర్, రామకృష్ణారావు, అహ్మద్ నదీమ్ లతో సీఎంవో ఇపుడు సమర్ధవంతంగా కనిపిస్తుండగా, మంత్రులు, ఎమ్మెల్యేల ఫిర్యాదులతో అజిత్ రెడ్డిని పక్కనబెట్టినట్లు తెలుస్తోంది. సంజయ్ జాజు, శ్రీధర్ ల హయాంలో.. గతంలో పాలన పరుగెత్తగా, ఉమ్మడి రాష్ట్రంలో అనేక కొత్త కార్యక్రమాలు ప్రవేశపెట్టారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలకు వేగంగా కార్యక్రమాలు అందించేందుకు రేవంత్ మార్క్ ప్రక్షాళన పూర్తిచేశారు. సంజయ్ జాజు సవ్యసాచి తెలంగాణ కేడర్‌కు చెందిన సంజయ్ జాజు 1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మీ సేవతోపాటు పలు కీలక ఐటీ ప్రాజెక్టులను ప్రారంభించిన సంజయ్ జాజు చివరగా కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తితో.. ఇటీవల 3 రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ సర్వీసుల నుంచి సంజయ్ జాజును రిలీవ్ చేశారు. మినిస్ట్రీ ఆఫ్ డెవలప్‌మెంట్ ఆఫ్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ సెక్రటరీగా ఉన్న సంజయ్ జాజును తెలంగాణకు కేటాయిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ (డీఓపీటీ) డైరెక్టర్ అన్నీస్ కన్మణి జాయ్ ఇప్పటికే ఉత్తర్వులు విడుదల చేశారు. సీనియర్ ఐఏఎస్ సంజయ్ జాజు 1992 బ్యాచ్‌కు చెందిన అధికారి కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన తన పనులతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. విజయవాడ జిల్లా సబ్ కలెక్టర్‌గా.. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా.. హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా.. కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా కూడా సంజయ్ జాజు సేవలు అందించారు. మీ సేవ, మున్సిపల్ సేవల్లో మరింత పారదర్శకతను తీసుకువచ్చే ఐటీ ప్రాజెక్టులకు సంజయ్ జాజు ప్రవేశపెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 అక్టోబర్‌లో డిప్యుటేషన్‌పై కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లోకి వెళ్లిన సంజయ్ జాజు.. గత 12 ఏళ్లలో కేంద్రంలోని అత్యంత కీలకమైన, వ్యూహాత్మకమైన శాఖల్లో ఉన్నతాధికారిగా పనిచేశారు. 2014 నుంచి 2018 వరకు ఎన్ హెచ్ఐడీసీఎల్‌కు డైరెక్టర్‌గా పనిచేసిన సంజయ్ జాజు.. ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవులు, హిమాలయ సరిహద్దుల్లో వ్యూహాత్మక నేషనల్ హైవేలు, కఠినమైన టన్నెల్స్ నిర్మాణానికి నిధుల సమీకరణ చేపట్టారు. ఆ తర్వాత 2018 నుంచి 2022 వరకు రక్షణ మంత్రిత్వ శాఖలో రక్షణ ఉత్పాదక శాఖ అడిషనల్ సెక్రటరీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన ప్రతిష్ఠాత్మక ఆత్మనిర్భర్ భారత్‌ను రక్షణ రంగంలో అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. సంజయ్ జాజు ఫలితాలు వచ్చేలా పనిచేయడంలో సవ్యసాచి.

# మోదీ 3.0 కేబినెట్ పునర్వ్యవస్థీకరణ

( మొదటి పేజీ తరువాయి )

ప్రాంతీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు, ప్రభుత్వ పరిపాలనా వేగాన్ని మునుపెన్నడూ లేని విధంగా ముమ్మరం చేసేందుకు ప్రధాని మోదీ ఈ వ్యూహాత్మక చదరంగాన్ని సిద్ధం చేశారు.

**శక్తికాంత దాస్ చేతికి ఆర్థికశాఖ?**

నూతన మంత్రివర్గ ప్రక్షాళనలో అంతర్జాతీయ ఆర్థిక రంగాన్ని సైతం ఆకర్షిస్తున్న మార్పు దేశ ఆర్థిక నాయకత్వానికి సంబంధించి జరగబోతోంది. భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్‌గా దేశ ఆర్థిక రథాన్ని సంక్షోభాల నుంచి సురక్షిత తీరాలకు చేర్చిన అనుభవజ్ఞుడు, ప్రస్తుతం ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి2గా అత్యంత కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న శక్తికాంత దాస్‌ను నేరుగా కేంద్ర కేబినెట్‌లోకి తీసుకురావాలని అధిష్టానం నిర్ణయించినట్లు జాతీయమీడియాలో ప్రచారం జరుగుతోంది. ప్రపంచ ఆర్థిక సవాళ్లు, దేశీయ ద్రవ్యోల్బణ నియంత్రణ వంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ఆయనకు నేరుగా కేంద్ర ఆర్థిక శాఖ పగ్గాలు అప్పగించడం ద్వారా విదేశీ పెట్టుబడులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని స్థిరత్వాన్ని చేకూర్చవచ్చని మోదీ భావిస్తున్నారు. , ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆ శాఖ నుంచి బదిలీ చేసి, కేంద్ర విద్యాశాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు బలమైన ప్రచారం సాగుతోంది.

**నితీష్ కుమార్ కు కీలకశాఖ**

ఈ కేబినెట్ కూర్పులో ఎన్‌డీఏ మిత్రపక్షాల బంధాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధాని ప్రత్యేక దృష్టి పెట్టారు.నితీష్ కుమార్ కు కేబినెట్ లో కీలకబెర్త్ దక్కనుంది. ప్రస్తుతం కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు శాఖ మారే అవకాశం ఉన్నట్లు ఢిల్లీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. పౌరవిమానయాన శాఖలో ఆయన చూపిన చొరవ, యువ నాయకత్వ పటిమను పరిగణనలోకి తీసుకున్న మోదీ, ఆయనకు మరింత ప్రజా సంబంధాలు ఉన్న మౌలిక సదుపాయాల రంగం (ఉదాహరణకు నౌకాయానం లేదా భారీ పరిశ్రమలు) లేదా గ్రామీణ ప్రగతికి సంబంధించిన మరో కీలక శాఖను అప్పగించి ప్రమోషన్ ఇవ్వనున్నట్లు సమాచారం.

**తెలంగాణ నుంచి కేబినెట్ ఆశావహులు వీరే**

ఈసారి తెలంగాణలో పార్టీని మరింత సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా బీజేపీ అధిష్టానం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ బెర్త్ కోసం ముగ్గురు సీనియర్ నేతలు **గట్టి పోటీలో ఉన్నారు:** ఈటల రాజేందర్: తెలంగాణ రాజకీయాల్లో బలమైన బీసీ ముఖచిత్రంగా, సుదీర్ఘ పరిపాలనా అనుభవం ఉన్న నాయకుడిగా ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా పరిశీలనలో ఉంది. ఆయనకు కేబినెట్ హోదా దక్కితే రాష్ట్రంలో సామాజిక సమీకరణాలు పార్టీకి అనుకూలంగా మారుతాయని అధిష్టానం భావిస్తోంది.

**డీకే అరుణ:** జాతీయ స్థాయిలో పార్టీ ఉపాధ్యక్షురాలిగా సేవలందించిన అనుభవం, పాలమూరు ప్రాంతంలో గట్టి పట్టున్న మహిళా నాయకురాలు కావడంతో డీకే అరుణకు ఈసారి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

రఘునందన్ రావు: మెదక్ ఎంపీగా, అద్భుతమైన వాగ్ధాటి కలిగిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రఘునందన్ రావు కూడా రేసులో ఉన్నారు. యువ, దూకుడు నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే ఈయనకు సహాయ మంత్రి పదవి దక్కే ఛాన్స్ ఉంది.

**రాబోయే రాష్ట్రాల ఎన్నికలే లక్ష్యంగా**

రాబోయే కాలంలో జరగబోయే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, కూటమి రాజకీయాల సమతూకాన్ని పక్కాగా లెక్కగట్టి ఈ కేబినెట్ కూర్పును డిజైన్ చేశారు. ముఖ్యంగా దేశ రాజకీయ గమనాన్ని శాసించే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలోనే రాబోతున్న నేపథ్యంలో, బీజేపీ అక్కడ సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను చక్కదిద్దే పనిలో పడింది. అందులో భాగంగానే ప్రస్తుత ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరిని కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించి, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో అత్యంత కీలకమైన సంస్థాగత బాధ్యతలను అప్పగించనున్నారు. అదేవిధంగా పంజాబ్ రాష్ట్రంలో పార్టీ పునాదులను మరింత పటిష్టం చేసుకునే వ్యూహంలో భాగంగా, ఇటీవల రాజ్యసభ పదవీకాలం ముగిసిన రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానంలో సీనియర్ నేత తరుణ్ చుగ్‌కు ఈ విడత కేంద్ర కేబినెట్ లో సముచిత స్థానం లభించనుంది. మహారాష్ట్ర నుంచి ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే సారథ్యంలోని శివసేనకు పెద్దపీట వేస్తూ ఎంపీ శ్రీకాంత్ షిండేకు కేంద్ర మంత్రి పదవి ఖాయం చేశారు. ప్రజల్లో విపరీతమైన ఆదరణ కలిగి, ఇటీవల ఘనవిజయం సాధించిన అరుణ్ గోవిల్, విష్ణుదత్ శర్మ, జనార్దన్ సింగ్ సిగ్రీవాల్ వంటి ప్రముఖులకు సైతం ఈసారి ఢిల్లీ పీఠంపై స్థానం దక్కబోతుండగా, గతంలో సమర్ధవంతంగా పనిచేసిన అనురాగ్ ఠాకూర్‌ను మళ్లీ కేబినెట్ లోకి తీసుకురావడం ద్వారా యువ నాయకత్వానికి సరికొత్త ఉత్తేజాన్ని ఇస్తున్నారు.



## భారీ ఉద్వాసనల దిశగా అధిష్టానం

ఈ పునర్వ్యవస్థీకరణ కేవలం కొత్త ముఖాలను పరిచయం చేయడానికే పరిమితం కాకుండా, మంత్రుల పనితీరును నిశితంగా అంచనా వేసి తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. పాలనలో ఆశించిన వేగాన్ని అందుకోలేకపోయిన, వివాదాలకు కేంద్ర బిందువులుగా మారిన కీలక నేతలపై అధిష్టానం ఉక్కుపాదం మోపడానికి వెనుకాడటం లేదు. ఇప్పటికే కేరళకు చెందిన సీనియర్ నేత జార్జ్ కురియన్ తన మంత్రి పదవికి రాజీనామా చేయగా, దాన్ని రాష్ట్రపతి ఆమోదించారు. 'ఒక వ్యక్తి ఒకే పదవి' సిద్ధాంతం ప్రకారం హర్ష్ మల్హోత్రా (ఢిల్లీ), పంకజ్ చౌదరి (యూపీ) వంటి వారిని పూర్తిగా పార్టీ సంస్థాగత బలోపేతానికి పరిమితం చేయనున్నారు. మరోవైపు, సీనియర్ నేత మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌ల ప్రస్తుత శాఖలను పూర్తిగా మార్చి, వారి అనుభవానికి తగిన ఇతర కీలక రక్షణ లేదా మౌలిక సదుపాయాల శాఖలను అప్పగించడం ద్వారా పరిపాలనలో నూతన జవజీవాలను నింపాలని ప్రధాని మోదీ నిశ్చయించుకున్నారు. ఈ పరిణామాలన్నీ విశ్లేషిస్తే, ఈ కేబినెట్ ప్రక్షాళన అనేది కేవలం సాధారణ మార్పు కాదని, రాబోయే సార్వత్రిక వ్యూహాలకు దిక్సూచిగా, పాలనా సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచే ఒక సుదీర్ఘ పొలిటికల్ మాస్టర్ ప్లాన్ అని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

( మొదటి పేజీ తరువాయి )

ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నార్కోటిక్స్‌కు వ్యతిరేకంగా ప్రత్యేకంగా 'ఈగిల్ ఫోర్స్ అనే డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశామని, ఈ విభాగం సంపూర్ణంగా పనిచేయడానికి అవసరమైన ఆర్థిక వనరులు, రవాణా వాహనాలు సమకూర్చామన్నారు. ప్రాణాలకు ప్రమాదం ఉన్నప్పటికీ సమాజాన్ని కాపాడేందుకు పనిచేస్తున్న ఈ పోలీస్ ఉద్యోగ వ్యవస్థకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ ఇచ్చే ప్రపోజల్‌ను ప్రభుత్వం తక్షణమే ఆమోదించి, వారిని ప్రోత్సహిస్తోందన్నారు. జీవితం చాలా విలువైనదని, ఉన్నత స్థానాలు సాధించి సమాజానికి మేలు చేయడానికే మనం జన్మించామని భట్టి విక్రమార్క అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని, వారి ఆశలను, ప్రభుత్వ ఆకాంక్షలను నిజం చేయడం కోసం ప్రతి ఒక్కరు 'సే నో టు డ్రగ్స్' అని గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాజ శ్రేయస్సే బాధ్యతగా పటిష్టమైన పోలీస్ యంత్రాంగం అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతోందని అన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేవలం చట్టాలు చేసినంత మాత్రాన అన్నీ అమలు కావని, సమాజంలో మార్పు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో వచ్చిన వరకట్న నిషేధ చట్టాన్ని ఉదాహరణగా చెప్తూ, కుటుంబాలు సామాజికంగా దాన్ని అర్థం చేసుకున్నప్పుడే విజయవంతం అవుతుందన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో కౌన్సెలింగ్ ఇస్తూనే, సమాజాన్ని ప్రభావితం చేయగల నాయకులు, సెలబ్రిటీలు దీనిపై వీడియో, ట్వీట్ చేసి అవగాహన కల్పించాలని కోరారు. సినిమా రంగానికి సంబంధించిన హీరోలు, హీరోయిన్లు, నటులు, ప్రముఖ దర్శకులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఇచ్చే చిన్న సందేశం అనేకమంది యువతీ యువకుల భవిష్యత్తును మారుస్తుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మాకూ బాధ్యత ఉందని భావించి, సినీ ప్రముఖులంతా 'సే నో టు డ్రగ్స్' పై వీడియో రికార్డెడ్ సందేశాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. అవసరమైతే ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్, సినిమాటోగ్రఫీ శాఖ అధికారులను మీ వద్దకు పంపి ఆ సందేశాలను రికార్డ్ చేయించి, రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. పోలీస్ యంత్రాంగం, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తో పాటు ముఖ్యంగా 'ఈగిల్ ఫోర్స్'కు ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. డ్రగ్ రహిత తెలంగాణ కోసం అందరం చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకుందామని, చిన్నారుల మేధస్సు ప్రపంచానికి ఉపయోగపడాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# మాదకద్రవ్యాల మాఫియాపై ఉక్కుపాదం

**నషా ముక్త్ భారత్‌కు నాంది**

**అమిత్ షా కొత్త వ్యూహం**



**హైదరాబాద్, మహా :** దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. డ్రగ్ మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం 'నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్ 20262029'ను విడుదల చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా ఆధారిత, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన, నెట్‌వర్క్ కేంద్రిత వ్యూహాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. న్యూఢిల్లీలో జరిగిన 10వ నార్కో కోఆర్డినేషన్ సెంటర్ ఉన్నతస్థాయి సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో అన్ని సంస్థలు సమన్వయంతో పనిచేస్తే డ్రగ్స్ నిర్మూలనలో గణనీయమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. డ్రగ్ స్మగ్లర్లపై ఎలాంటి కనికరం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాలకు బానిసైన యువత పట్ల సానుభూతితో వ్యవహరించి వారిని పునరావాసం వైపు నడిపించాలన్నారు.ఈ సందర్భంగా ఎన్‌సీబీ వార్షిక నివేదిక2025ను కూడా విడుదల చేసిన అమిత్ షా.. జమ్మూ, గువాహటిలో కొత్తగా నిర్మించిన ఎన్‌సీబీ జోనల్ కార్యాలయాలను ప్రారంభించారు. అలాగే 'ఆన్‌లైన్ డ్రగ్ డిస్పోజల్ ఫోర్ట్‌నైట్ క్యాంపెయిన్'కు శ్రీకారం చుట్టారు. ఒకే రోజులో రూ.12,525 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను ధ్వంసం చేసినందుకు సంబంధిత సంస్థలను అభినందించారు. కేంద్ర హోంశాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, డ్రగ్స్ నియంత్రణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సమన్వయంతో పనిచేసే కార్యాచరణపై చర్చించారు.కొత్త విజన్ డాక్యుమెంట్‌లో సింథటిక్ డ్రగ్స్, డార్క్‌నెట్ ద్వారా జరుగుతున్న డ్రగ్ ట్రాఫికింగ్ వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనే వ్యూహాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అంతేకాకుండా డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు, చికిత్స, పునరావాస సేవలను మరింత బలోపేతం చేసే కార్యాచరణను కూడా ఇందులో పొందుపరిచారు. "నషా ముక్త్ భారత్" లక్ష్య సాధనకు ఈ విజన్ డాక్యుమెంట్ మార్గదర్శకంగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం సహించం.

**'ఫ్రైడే-డ్రైడే' అమలుపై పవన్ కల్యాణ్ కఠిన ఆదేశాలు.**

**అమరావతి, మహా :** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో అధికారులు ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా సహించే ప్రసక్తే లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని ఆయన తేల్చిచెప్పారు. అమరావతిలో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నియంత్రణ తదితర అత్యవసర అంశాలపై ఆయన ఉన్నతాధికారులతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. వాతావరణ మార్పులు, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.దోమల నివారణ, అంటు వ్యాధుల నియంత్రణ కోసం ఉద్దేశించిన 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమం ఎట్టి పరిస్థితుల్లోనూ కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ప్రాంతంలో ఇది అత్యంత కఠినంగా, పక్కాగా అమలు కావాలని ఆదేశించారు. పారిశుద్ధ్య విధుల్లో జవాబుదారీతనం కోసం, ప్రతి శుక్రవారం అధికారులు విధిగా క్షేత్ర స్థాయిలో పర్యటించి తీరాలన్న నిబంధనను తప్పనిసరి చేశారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా మురుగు నిల్వలు లేకుండా తక్షణమే తొలగించాలని, దోమల ఉత్పత్తికి కారణమయ్యే కేంద్రాలను శాశ్వతంగా నిర్మూలించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజారోగ్యానికి ఎలాంటి ముప్పు కలగకుండా ముందస్తుగా బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలను తగిన మోతాదులో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, వీటి లభ్యతలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని ఆయన తేల్చిచెప్పారు.



## రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

# 660 డ్రోన్లతో భారీ దాడి

**మహా :** ఉక్రెయిన్‌రష్యా యుద్ధంలో డ్రోన్ దాడులు మరోసారి కీలక దశకు చేరాయి. మాస్కో ఆధీనంలోని క్రిమియాతో పాటు రష్యాలోని అనేక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్లు ప్రయోగించిందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒక్క రాత్రిలో 660 డ్రోన్లను అడ్డుకున్నామని మాస్కో ప్రకటించడం ఈ దాడుల తీవ్రతను చూపిస్తోంది. రాజధాని మాస్కో, అజోవ్ సముద్ర పరిసరాలు, నల్ల సముద్ర తీర ప్రాంతాలు, క్రిమియా ఈ దాడుల పరిధిలో ఉన్నాయని రష్యా వర్గాలు తెలిపాయి. మాస్కో వైపు వచ్చిన 47 డ్రోన్లను కూల్చి వేశామని నగర మేయర్ వెల్లడించారు.

# పంచాయతీరాజ్‌లో ప్రమోషన్లు

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖలో 42 మంది ఎంపీడీవోలకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆమోదం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 10 వేల మందికి పైగా ఉద్యోగులకు వివిధ క్యాడర్లలో ప్రమోషన్లు కల్పించినట్లు అధికారులు తెలిపారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణ, గ్రామీణ పారిశుధ్యం, తాగునీటి పరిశుభ్రతపై పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు అందుబాటులో ఉంచి ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



## తెలంగాణకు నితిన్ నబిన్

# మూడురోజులు ఇక్కడే మకాం

**హైదరాబాద్, మహా :** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణలో పర్యటించనున్నట్లు తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు వెల్లడించారు. జూన్ 28 నుండి జూన్ 30 వరకు మూడు రోజులపాటు ఆయన రాష్ట్రంలో పర్యటిస్తారని చెప్పారు. జూన్ 28న రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో నితిన్ నబీన్ పాల్గొంటారన్నారు. అదే కార్యక్రమంలో మరో 9 జిల్లా బీజేపీ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అనంతరం నాంపల్లి గ్రౌండ్స్‌లో బీజేపీ బూత్ అధ్యక్షుల సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నారు. తరువాత నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయాన్ని సందర్శించి, రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించనున్నారు. జూన్ 29 న రెండో రోజు వీబీఐటీలో నిర్వహించే వికసిత్ భారత్ యువ సంవాద్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించనున్నారు. అనంతరం వరంగల్‌కి వెళ్లి గిరిజన సంఘాల సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీజేపీ బూత్ కార్యకర్తల సమావేశంలో కూడా పాల్గొంటారు. రాత్రికి తిరిగి హైదరాబాద్‌కి చేరుకుని అక్కడే బస చేస్తారు. జూన్ 30న ఘట్కేసర్‌లో జరగనున్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం ఆయన ఢిల్లీకి తిరిగి బయలుదేరుతారు.



# బాహుబలి-3 కమింగ్

**బిగ్ అప్ డేట్ ఇచ్చిన ప్రభాస్**

మహా : ప్రభాస్, రానా, అనుష్క, సత్యరాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఎపిక్ యాక్షన్ మూవీ 'బాహుబలి . రెండు భాగాలుగా వచ్చిన ఈ మూవీ టాలీవుడ్ సత్తాను ప్రపంచదేశాలకు తెలిసేలా చేసింది. తాజాగా 'బాహుబలి: ది టార్చ్ బేరర్' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే దీని స్ట్రీమింగ్‌కు ముందు నెట్‌ఫ్లిక్స్ ఓ వీడియోను ప్రదర్శించింది. అందులో సినీ ప్రియులకు సర్‌ప్రైజ్ ఇస్తూ 'బాహుబలి 3' ఉంటుందని అధికారికంగా చెప్పారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ప్రపంచం ఈ ప్రకటనను ఊహించలేదు.. మీ అందరికోసం బాహుబలి మూడో భాగం రానుంది' అని ప్రభాస్, రానా, అనుష్క వెల్లడించారు.



## ఎస్.ఐ.ఆర్. ఓటర్ల ప్రక్షాళన ప్రారంభం

**చెన్నూరు /మంచిర్యాల, మహా :**మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో కాంగ్రెస్ డిసిసి ప్రధాన కార్యదర్శి, చెన్నూరు బ్లాక్ ఇన్చార్జి పుల్లూరి లక్ష్మణ్ (ఎస్.ఐ.ఆర్) ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నేతలకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం ఓటర్ నమోదు ఎన్నికల విధానాలపై కీలక సూచనలు చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఇక్కడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మండల ఇంఛార్జ్ కొండు వెంకటేష్, నాయకులు లింగంపల్లి మహేష్, ఉమ మహేశ్వరి,ఒడ్డి నవీన్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో పట్టాలెక్కనున్న 'రైతు డిస్కం'

- తుది దశకు లైసెన్సు జారీ ప్రక్రియ.
- వ్యవసాయానికి ప్రత్యేక విద్యుత్ పంపిణీ సంస్థ.
- దేశంలోనే తొలి రాష్ట్రంగా రికార్డు.
- ఈఆర్‌సీ వద్ద తుది కసరత్తు.
- త్వరలో అధికారిక ఉత్తర్వులు.



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యవసాయ రంగానికి సరికొత్త జవసత్వాలు అందించడంతో పాటు, రైతాంగానికి మరింత నాణ్యమైన విద్యుత్ సేవలను చేరువ చేసే బృహత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'రైతు డిస్కం' ఏర్పాటు ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. అన్నదాతల కోసం ప్రత్యేకంగా ఒక విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా దేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి రాష్ట్రంగా నిలిచేందుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. ఈ నూతన సంస్థ అధికారికంగా తన కార్యకలాపాలు ప్రారంభించేందుకు అత్యంత కీలకమైన లైసెన్సు జారీకి రంగం సిద్ధమైంది. రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ప్రస్తుతం ఈ లైసెన్సు జారీకి సంబంధించిన విధివిధానాలపై తుది కసరత్తు చేస్తోంది. త్వరలోనే దీనిపై అధికారికంగా తుది ఉత్తర్వులు వెలువడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నూతన విద్యుత్ పంపిణీ సంస్థకు చట్టబద్ధమైన అధికార హోదా దక్కాలంటే ఈఆర్‌సీ అనుమతి తప్పనిసరి అన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే లైసెన్సు మంజూరు కోసం రైతు డిస్కం ప్రతినిధులు గత మార్చి 19వ తేదీన అధికారికంగా దరఖాస్తు సమర్పించారు. నిబంధనల ప్రకారం ఈ కొత్త సంస్థ ఏర్పాటుపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు, సూచనలను ఈఆర్‌సీ ఆహ్వానించింది. ఇందులో భాగంగానే మే 29వ తేదీన ఒక బహిరంగ విచారణను సైతం నిర్వహించింది. ఈ విచారణలో వ్యక్తమైన వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు తదుపరి చర్యలను వేగవంతం చేశారు.

రైతు డిస్కంను కొత్తగా ఏర్పాటు చేయాలంటే ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్), దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)ల లైసెన్సుల్లో గణనీయమైన మార్పులు చేయాల్సి ఉంటుంది. వాటి అధికార పరిధిని సవరించే అంశంపై ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతూ ఈఆర్‌సీ గత నెల 23న బహిరంగ ప్రకటన జారీ చేసింది. అభ్యంతరాలు, సూచనలు సమర్పించేందుకు ఈ నెల 22 వరకు ఇచ్చిన గడువు ముగియడంతో.. మొత్తం నాలుగు అభ్యంతరాలు, మరికొన్ని సూచనలు అందినట్లు అధికారిక వర్గాల సమాచారం. ప్రస్తుతం అధికారులు వాటిని నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలన పూర్తయిన వెంటనే లైసెన్సు మంజూరు ప్రక్రియ కొలిక్కి రానుంది. ఈ లైసెన్సు మంజూరుతో పాటు ప్రస్తుత డిస్కంల పరిధిలో కీలకమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. సాధారణ గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లను మినహాయించి కేవలం ప్రభుత్వ సబ్సిడీలతో నడిచే పలు కనెక్షన్లను మాత్రమే కొత్తగా ఏర్పడే రైతు డిస్కంకు బదిలీ చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో పాటు భారీ, మధ్యతరహా ఎత్తిపోతల ప్రాజెక్టులు, ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లు, ఇతర ప్రభుత్వ, మున్సిపల్ తాగునీటి సరఫరా పథకాల కనెక్షన్లు అన్నీ ఇకపై రైతు డిస్కం పరిధిలోకి రానున్నాయి. ఈ కనెక్షన్లన్నింటినీ ప్రస్తుతమున్న రెండు డిస్కంల నుంచి పూర్తిగా తొలగించి, నూతన సంస్థకు అప్పగిస్తారు. ఈ బదిలీ ప్రక్రియ పూర్తి చేసి ఈఆర్‌సీ లైసెన్స్ జారీ చేస్తేనే.. వీటికి నిరంతర విద్యుత్ సరఫరా చేసే చట్టబద్ధమైన అధికారం రైతు డిస్కంకు దక్కుతుంది. ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల అటు సాధారణ డిస్కంలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గడంతో పాటు, ఇటు అన్నదాతలకు అత్యంత నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా సాధ్యపడుతుందని వ్యవసాయ, విద్యుత్ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.



## రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**మహా వరంగల్ కార్పొరేషన్;**
బల్దియా పరిధిలోని 16 వ డివిజన్ కీర్తి నగర్ లో రూ.80 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులతో పాటు ధర్మారం లోని గరీబ్ నగర్ లో రూ.11 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న మంచి నీటి పైపు లైన్ నిర్మాణ పనులకు, మొగిలిచర్ల ప్రాంతం లో రూ.80 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న సి సి రోడ్లు,డ్రైన్ ల నిర్మాణ పనులకు ,రెడ్డి పాలెం లో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సి సి రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ కార్పొరేటర్ మనీషా శివ కుమార్ ఈ ఈ సంతోష్ బాబు, హెచ్ ఓ లక్ష్మారెడ్డి, డి ఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు సరిగ్గా లేకపోవడంతో నాయకుల ధర్నా

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ నుంచి షాబాద్ వరకు చేపట్టిన 100 అడుగుల రహదారి విస్తరణ పనులు రెండేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ, నర్కుడా ప్రాంతంలో గత 18 నెలలుగా పనులు నిలిచిపోయాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ బుర్కుంట సతీష్, బీజేపీ నాయకుడు నాన్నవాళ్ల కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారని, ఏడాదిగా అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను పలుమార్లు కలిసి పనులు పూర్తి చేయాలని కోరినా ఫలితం లేకపోయిందని, రాజకీయ కక్షసాధింపుతోనే పనులు నిలిపివేశారని ఆరోపించారు. రూ.18 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం రహదారి విస్తరణ పనులు ప్రారంభించారని, పాత రోడ్డును తొలగించిన తర్వాత ఆరు నెలలకే పనులు నిలిచిపోయాయని విమర్శించారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని, లేదంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, నర్కుడా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ నిరటి మహేష్ తదితరులు ఘటనాస్థలికి చేరుకుని వివరణ ఇచ్చారు. సాంకేతిక కారణాల వల్లే పనులు ఆలస్యమయ్యాయని, మరో పది రోజుల్లో కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంభిస్తారని, నెల రోజుల్లో రహదారి పూర్తవుతుందని తెలిపారు. రోడ్డు అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని బీఆర్ఎస్, బీజేపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రహదారి నిర్మాణం కాంట్రాక్టర్ బాధ్యత అని, దీనికి ఎమ్మెల్యే రాజీనామా చేయాలనడం సమంజసం కాదన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, తెలంగాణ అభివృద్ధిలో ముందంజలో ఉందని వారు పేర్కొన్నారు.



## మోహరం పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, మాజీ కార్పొరేటర్లు


**వరంగల్ మహా :** ఖిలా వరంగల్ లో ముస్లిం మత పెద్దలు నిర్వాహకులు నిర్వహించిన మోహరం పీర్ల పండుగ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అధ్యక్షులు అయూబ్ 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ విచ్చేసి పూజా కార్యక్రమాలును ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నేత నల్గొండ రమేష్ , మాజీ కార్పొరేటర్లు బిల్లా శ్రీకాంత్, ధూపం సంపత్, సీనియర్ నాయకులు గోరంట్ల రాజు వెల్దండి లక్ష్మణ్ తోట బాలరాజు మార్త ఆంజనేయులు సింగారపు చిరంజీవి నారగోని స్వప్న మురళి తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## యువత సమాజం దేశం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి.!

- డ్రగ్స్ గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా యువత...
- ఒక మంచి మార్గాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి
- మహేశ్వరం డిసిపి కె నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం జూన్ 26 మహా**:యువత సమాజం దేశం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని డిసిపి నారాయణరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, ఇబ్రహీంపట్నం పోలీసులు గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వారితో సంయుక్తంగా, శుక్రవారం ఇబ్రహీంపట్నం లోని గురునానక్ కళాశాల ప్రధాన ఆడిటోరియంలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహేశ్వరం డిసిపి కె నారాయణరెడ్డి, ఏసిపి కెపివి రాజు, డ్రగ్స్ మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డిసిపి మాట్లాడుతూ... యువత విద్యార్థులు డ్రగ్స్ గంజాయి వంటి మాదకద్రవ్యాలపై అవగాహనకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజం దేశం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని ఆయన అన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని లేనియెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిసిపి హెచ్చరించారు. డ్రగ్స్ పై ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా యువతకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. విద్యార్థులచే డ్రగ్స్ పై వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## తులేకాలన్ గ్రామంలో విషాదం..

- ట్రాక్టర్ ఇనుప చక్రం మీద పడి చిన్నారి మృతి
- చిన్నారి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన గ్రామస్తులు

**ఇబ్రహీంపట్నం జూన్ 26 మహా:** తులేకాలన్ గ్రామంలో ట్రాక్టర్ ఇనుప చక్రం మీద పడి చిన్నారి మృతి చెందిన విషాద ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, తులేకలాన్ గ్రామనికి చెందిన జక్కుల లింగం, మాధవి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె అభిరామి(3) ఉన్నారు. శుక్రవారం ఇంటి పక్కన నిలిపిన ట్రాక్టర్ ఇనుప చక్రాలు వద్ద ఆడుకుంటుండగా, ఒక్కసారిగా ఇనుప చక్రం చిన్నారిపై పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చిన్నారిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందింది.చిన్నారి మృతి పట్ల, కుటుంబ సభ్యులు గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. దీంతో తులేకాలన్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.



## బి ఎల్ ఓ, బి ఎల్ ఏలకు సహకరించండి


**16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ పిలుపు**

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా: ప్రత్యేక ఓటర్ సవరణ సర్వే కార్యక్రమంలో భాగంగా మన ఇంటి ముందుకు వచ్చే బిఎల్ఓ, బి ఎల్ ఏలకు ఓటర్లు సహకరించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం నియోజకవర్గంలోని రామవరంలో 182వ బూతు బిఎల్ఓ బిఎల్ఎ లు ఇంటింటికి తిరిగి సంబంధిత పత్రాలను పంచే కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగడప పద్మ పాల్గొని మాట్లాడుతూ సర్వేలో ఓటర్లు అప్రమత్తంగా ఉండి తమ ఓటును కాపాడుకోవాలని మన ఇంటికి వచ్చే బీఎల్ఓలకు వారు అడిగిన సమాచారాన్ని ఇచ్చి మీకు ఇచ్చిన ఫారంను పూర్తి చేసి మరల బిఎల్ఓకు ఇచ్చేంతవరకు సహకరించాలని ఆమె తెలిపారు. ఈనెల 25 నుండి జూలై 24 వరకు ఈ సవరణ సర్వే జరుగుతుందని దీనిలో కొత్త ఓటర్లను చేర్చుకోవడం చనిపోయిన ఓటర్లను తొలగించడం ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్న ఓట్లలో అదనపు ఓటును తొలగించడం మన ఓటర్ లిస్ట్ లో ఉన్న తప్పులను సరి చేసుకోవడం చేస్తారని ఆమె తెలిపారు. దరఖాస్తును పూర్తిచేసే సందర్భంలో మనకు అర్థం కానట్లయితే బిఎల్ ఎల సహాయం తీసుకొని మీకు ఇచ్చిన పారాలను పూర్తి చేసి బిఎల్ఓ లకు ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ శివరాం, సిపిఐ జిల్లా నాయకులు మునిగడప పద్మ వెంకటేశ్వర్లు, సిపిఐ 182వ బూతు లెవల్ బిఎల్ఎ జావిద్ పాష, టిఆర్ఎస్ బి ఎల్ ఏ అంజుమ్ నాయకులు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**ధీరావత్ పుష్పావతి**

**నేలకొండపల్లి, జూన్ 26 మహా:** తన కుటుంబం పై తప్పుడు ఆరోపణ లు చేస్తే సహించేది లేదని ధీరావత్ పుష్పావతి హెచ్చరించారు. మండలం లోని మంగాపురంతండా లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు... గ్రామంలో తన కుటుంబం భూ ఆక్రమణ చేసినట్లు కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాను భూమి ఆక్రమణ జరిగినట్లు రుజువు చేయాలని సూచించారు. కొంత మంది రాజకీయం కోసం తమ పై' బురద చల్లుతున్నారని అన్నారు. సామాజిక సేవ తప్ప... ఆక్రమణలు, అన్యాయం తమకు తెలియదన్నారు. గ్రామంలో కొంత మంది రహదారి ని అక్రమించారని తాము జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిందుకు తమ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణ పై బహిరంగంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి ఆక్రమణల నుంచి అన్నింటిని తిరిగి ప్రభుత్వం కు ఇచ్చేలా ముందుకు వస్తే తానే ముందుంటానన్నారు. దీనికి తోడు మతాలను రెచ్చగొడుతూ... సోషల్ మీడియా లో అసభ్యంగా పోస్టులను పెడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా వాస్తవాలు వ్రాసినందుకు మీడియా పై తప్పుడు 'వ్యాఖ్యలు చేయటం బాధకరమని పేర్కొన్నారు. ఆరోపణలు చేసే వారికి చిత్తశుద్ధి ఉంటే ఆక్రమణల పై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సూచించారు. తమ కుటుంబం పై తప్పుడు ప్రచారం చేసిన వారి పై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు



## రెండేళ్లలోనే 3వేల ఇందిరమ్మ ఇళ్లు ఆడబిడ్డల పేరున ఇచ్చాం..

- త్వరలోనే నియోజకవర్గానికి మరో 2వేల ఇళ్లు...
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి...
- మన్నెగూడలో ఇందిరమ్మ చీరల పంపిణీ....



ఇబ్రహీంపట్నం జూన్ 26 మహా: ఒకనాడు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకుని ఆదర్శంగా నిలిచిన నియోజకవర్గంలోని గ్రామాలు... 14ఏళ్లలో అధోగతిపాలయ్యాయని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. ఒకే చోట 60ఎకరాలు కబ్జా చేసిన బీఆర్ఎస్ పాలకులు... పేదోడికి మాత్రం 60గజాల జాగ ఇవ్వలేకపోయారన్నారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి మల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆదిబట్ల సర్కిల్‌లో గల తొర్రూర్, కొంగరకలాన్, ఆదిబట్ల, తుర్కయంజాల్ డివిజన్లకు చెందిన మహిళలకు 34,320 చీరలు మంజూరు కాగా... ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.

**బతుకమ్మ ఆటలతో ఘనస్వాగతం....**

చీరల పంపిణీ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చిన మహిళలు.... ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆడుతూ... ఊర్రూతలూగించారు. అభిమాననాయకుడితో ఫోటోలు దిగేందుకు పోటీపడ్డారు.

**మాటలతో మాయచేసిన వారికి మహిళలే బుద్ధిచెప్పాలి: మల్‌రెడ్డి....**

పదేళ్లలో పేదలకు పది ఇళ్లు కూడా నిర్మించలేకపోయారు. రెండేళ్లలోనే 3వేల ఇందిరమ్మ ఇళ్లు ఆడబిడ్డల పేరున ఇచ్చాం. త్వరలోనే నియోజకవర్గానికి మరో 2వేల ఇళ్లు ఇవ్వనున్నాం. బీఆర్ఎస్ పాలకులు బతుకమ్మలు ఆడించి నిధులు కాదేశాలన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ఇందిరమ్మ రాజ్యంలో పాలన సాగుతోంది. నియోజకవర్గానికి త్వరలోనే మరో వంద బస్సులు తెచ్చేలా రవాణాశాఖ మంత్రిని ఒప్పించాను. ఇప్పటి వరకు లేనివిధంగా 40వేల మెజార్టీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తా. బతుకమ్మ ఆటలు, మాయచేసే మాటలతో పదేళ్లు కాలం గడిపిన వారికి మహిళలు బుద్ధిచెప్పాలి. ఈ కార్యక్రమంలో ఆదిభట్ల సర్కిల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం టెంపుల్ కారిడార్‌కు కేంద్రం అండ

- 98 కోట్ల నిధులు సద్వినియోగం చేయని ఆనాటి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు
- త్వరలో పాండురంగాపురం వరకు నూతన రైల్వే నిర్మాణం

**భద్రాచలం, మహా :**భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కారిడార్ అభివృద్ధిపై బీజేపీ నేతలు సారపాక లోని బిజెపి నేత కన్నదారి ప్రసాద్ స్వగృహం లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా బీజేపీ నేత ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, భద్రాచలం టెంపుల్ అభివృద్ధికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. 202022 సంవత్సరంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధి కోసం రూ.98 కోట్లుమంజూరు చేసిందని గుర్తు చేశారు. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సరిగా వినియోగించుకోలేదని ఆరోపించారు. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి భద్రాచలం టెంపుల్ అభివృద్ధి కోసం రూ.350 కోట్లతో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కేంద్రం ఇప్పటికే మంజూరు చేసిన రూ.98 కోట్లను కూడా కలుపుకొని భద్రాచలం ఆలయాన్ని జాతీయ స్థాయి యాత్రా కేంద్రంగా తీర్చిద్దాలని డిమాండ్ చేశారు.



**నూతన రైల్వే లైన్:** నాలుగు రాష్ట్రాలను కలుపుతూ భద్రాచలం నుండి పాండురంగాపురం వరకు కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలి. దీనివల్ల యాత్రికుల రాకపోకలు సులభతరమవుతాయని అన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్: జిల్లాలో సింగరేణి, ఐటిసి బిటిపిఎస్ వంటి భారీ పరిశ్రమలు ఉన్నాయి. వేలాది కార్మికులు పని చేస్తున్నారు. వారి ఆరోగ్య సంరక్షణ కోసం ఆయా ప్రాంతాల్లో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కార్మిక సంక్షేమం:** పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలి. వసతి, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.నేషనల్ హైవే: భద్రాచలం కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు నేషనల్ హైవే నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఆ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల, డివిజన్ స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలిమ్ సెన్సార్ బోర్డు మెంబర్ కన్నెదారి వరప్రసాద్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంజా ధర్మ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గూగులోతు బాలు నాయక్ జిల్లా నాయకులు బిజ్జం శ్రీనివాస్ రెడ్డి కుంజా సంతోష్ చుక్కపల్లి బాలాజీ కేసు గాని శ్రీనివాస్ గౌడ్ నాగబాబువై వెంకటేశ్వరరావు ఓరుగంటి సురేష్ శ్రీనివాస్ రెడ్డి జాదవుల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# గుంపు మేస్త్రీ...



ఏమమ్మా.. ఇవాళ పనిలోకి ఎంత మంది వచ్చారు. ఇటుక లోడు వచ్చిందా? ఇసుక జల్లెడ పట్టారా... మాల్ ఎంత కలిపారు. ఎవరు ఏ పని చేస్తున్నారు. నీ బిడ్డకు జ్వరం తగ్గిందా... ఏమయ్యా మీ పిల్లగాడు స్కూల్ కు పోతున్నాడా? ఇలాంటి మాటలు మనకు ఇళ్ల నిర్మాణం దగ్గర వినిపించడం సహజం. పొద్దున్నే పనిలోకి వచ్చే మేస్త్రీ తోటి కూలీలను ఈ కుశల ప్రశ్నలు వేయటం సహజం. పనిలోకి ఎంత మంది కూలీలు వచ్చారో, పని చేసేందుకు అవసరమైన మెటీరియల్ ఎంత వుందో, ఎవరు ఏం పని చేస్తున్నారో గమనించటం, వారి మంచి చెడు విచారించటంతో ఆ రోజు చేయాల్సిన నిర్మాణ పనులు ఆ మేస్త్రీ మొదలు పెట్టటం చూస్తుంటాం. ఇప్పుడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇలాంటి బాధ్యతలు తీసుకున్నారు. నన్ను గుంపు మేస్త్రీ అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ఎస్... నేను గుంపు మేస్త్రీనే. తెలంగాణ రాష్ట్ర నిర్మాణం నా పని. ఇందుకు ప్రభుత్వ ఉద్యోగులు నాకు అండ. అంటూ తనపై విమర్శలు చేసే వారికి చెంపచెల్లు మనిపించారు రేవంత్ రెడ్డి. కాస్త లోతుగా ఆలోచన చేసే వారికి సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో ఎంత అర్థం వుందో తెలుస్తుంది. ఆయన ఆవేశంతోనే, ఆవేదనతోనో, లేక యాదృశ్చికంగానో ఈ వ్యాఖ్యలు చేయలేదు. ఆయన మనసులో వున్న మాట అది. ఇందులో ఆయన లక్ష్యం, సంకల్పం, ఆత్మవిశ్వాసం, గుండెధైర్యం కనిపించడం విశేషం. ప్రభుత్వ ఉద్యోగులకు కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించే ఓ మహోత్తర కార్యం ఆయన చేపట్టారు. ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆరోగ్య ధీమాతో ఉండాలి అనే సదుద్దేశ్యంతో ఈ నిర్ణయం ఆయన తీసుకొని అమలులోకి తెచ్చారు. ఇది ఓ సాహసమే. ప్రభుత్వాలు ఉద్యోగులకు ఎంత భరోసా ఇస్తే అంత కమిట్ మెంట్ వాళ్ళల్లో పెరుగుతుంది. ఇప్పుడు ఈ నిజం సీఎం రేవంత్ గుర్తించారు. ఓ మంచి కార్యక్రమం మొదలు పెట్టారు. తెలంగాణలోని రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఇక ముందు ఈ బీమా సదుపాయం పొందవచ్చు. పెన్షనర్లకు ఈ సదుపాయం దక్కనుంది. నిజానికి ప్రభుత్వ ఉద్యోగులు ఈ అంశం ప్రభుత్వం ముందు పెట్టలేదు. అయినా సీఎం రేవంత్ కాస్త లోతుగా ఆలోచన చేశారు. అమలులోకి తెచ్చారు.

ఏ రాష్ట్ర ప్రభుత్వానికైనా ఉద్యోగులు అత్యంత కీలకం. ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు, పథకాలు ప్రజలకు చేర్చేది ప్రభుత్వ ఉద్యోగులే. క్షేత్ర స్థాయి వరకు ప్రభుత్వ పాలసీలు ఉద్యోగులతోనే చేరుతున్నాయి. ఉద్యోగులు ఇందులో ఏ మాత్రం శ్రద్ధ చూపించక పోయినా ప్రభుత్వ ఆలోచన ప్రజల వరకు చేరడం కష్టం. ప్రభుత్వ ఉద్యోగులు ఎంత నిజాయితీతో పని చేస్తే అంతగా ఆ ప్రభుత్వం పై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ప్రభుత్వ ఉద్యోగులు వారధులు. అందుకే ఏ పార్టీ అధికారంలో వున్నా ప్రభుత్వ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వటం తప్పనిసరి. అప్పడే ఆ ప్రభుత్వం ప్రజలకు చేరువ కూడా అవుతుంది. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో ఓ అడుగు ముందుకు వేశారు. ఇక్కడితో ఆయన ఆగి పోలేదు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న పీఆర్సీ వాగ్దానం కూడా పూర్తి చేస్తామని చల్లని కబురు అందించారు. ఆహా... సీఎం అంటే ఇలా ఉండాలి కదా. తాము ఏం కోరుకున్నామో అదే ఆయన నోటి నుంచి వచ్చింది. అంటూ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు తెగ సంబర పడుతున్నారు. సీఎం రేవంత్ మెరుగైన పీఆర్సీ ఇస్తారన్న ఆశ కూడా ఇప్పుడు వాళ్ళ నోటి నుంచి వస్తోంది. ఉద్యోగులు ఇప్పుడు చిత్తశుద్ధితో పని చేసే వాతావరణం సీఎం రేవంత్ తీసుకొని రావటం గమనార్హం.

అసలు సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య బీమా అందించాలి అనే ఆలోచన ఎలా వచ్చింది? ఇందుకు కారణం డిప్యూటీ సీఎం భట్టి అంటూ సీఎం రేవంత్ స్వయంగా చెప్పేశారు. సింగరేణిలో మృతి చెందిన 45 మంది కార్మికులకు సహాయం అందించే ప్రక్రియలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రభుత్వ ఉద్యోగులకు ఇలాంటి బీమా ఆలోచన సీఎం దృష్టికి తెచ్చారు. మొదట్లో దీని అమలుపై సీఎం రేవంత్ కు సందేహాలు వున్నా భట్టి విక్రమార్క ఈ ఆలోచనను అమలు చేసి చూపించారని, ఈ క్రెడిట్ అంతా ఆయనదేనని సీఎం చెప్పటం ఆయన వ్యక్తిత్వ నిజాయితీకి అద్దం పడుతోంది. ఇక ప్రభుత్వ ఉద్యోగుల నుంచి అవసరమైన సహాయం, సహకారం సీఎం రేవంత్ ఆశిస్తున్నారు. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయమైన పన్నులు వసూలు చేయాలని, రోజుకు ఓ గంట అదనంగా ఉద్యోగులు పని చేయాలని సూచించారు. ప్రభుత్వానికి ఆదాయం వస్తే అది ఉద్యోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకే వినియోగిస్తామని సీఎం హామీ కూడా ఇచ్చారు. తాను ఇప్పటి వరకు ఒక్క రోజు సెలవు తీసుకోలేదని, రోజుకు 16 నుంచి 18 గంటలు రాష్ట్రం కోసం శ్రమించి పని చేస్తున్నానని వివరించిన సీఎం ప్రభుత్వ ఉద్యోగులు కూడా సహకారం అందిస్తే రాష్ట్రం ప్రగతి మరింత వేగం పుంజుకుంటుందని చెప్పటం వెనుక ఆయన అంకిత భావం కనిపిస్తోందంటున్నారు మేధావులు...ఓ మంచి పనికి శ్రీకారం చుడితే మెచ్చుకునే వారి కన్నా నొచ్చుకునే వారే ఎక్కువ వుంటారు. ఈ విషయం కూడా ఇక్కడ సీఎం రేవంత్ ప్రస్తావనకు తెచ్చారు. రాజకీయాల్లో ఇలాంటివి సహజం. వాటిని ఎంత వరకు చెవిన వేసుకోవాలో అంత వరకే వేసుకోవాలి. పాలకులకు ప్రతి పక్ష విమర్శలు, ఆరోపణలు కేవలం సూచనలు మాత్రమే. అందులో మంచి ఉంటే తీసుకో వచ్చు. కేవలం బురద మాత్రమే జల్లే వ్యవహారాలు అయితే పక్కన పెట్టేయవచ్చు. అధికారంలో వున్నప్పుడు సహేతుక నిర్ణయాలు తీసుకొనే వారు ప్రతి పక్ష పార్టీలు చేసే ప్రతీ నిందారోపణలకు అతిగా స్పందించవల్సిన పని లేదు.

ఏ ప్రభుత్వమైనా ఉద్యోగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. ఉద్యోగులు సహకారం అందించక పోతే ప్రభుత్వాలు పాలనలో బోల్తా పడతాయి. ఇందులో అనుమానం లేదు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు కూడా నిబద్దత పాటించాలి. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని కూడా గమనించాలి. తమ కోర్కెలు ప్రభుత్వం ఎంత మేరకు తట్టుకునే స్థాయిలో వుందో ఉద్యోగులు అంచనా వేయాలి. సాధ్యం అయ్యే డిమాండ్లు ఏమిటో ఉద్యోగ సంఘాలు లోతుగా అధ్యాయనం చేయాలి. అవే ప్రభుత్వం ముందు ఉంచాలి. అప్పడే వాటిని ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకొని పరిష్కారం చూపే పరిస్థితి ఉంటుంది.

ప్రభుత్వ ఉద్యోగులు తలచుకుంటే ప్రభుత్వాలు మారి పోతాయి. ఉద్యోగులను నిర్లక్ష్యం చేసి వారిని ఇబ్బంది పెట్టిన ప్రభుత్వాలు ఎన్నో అడ్రస్ లేకుండా పోయాయి. ఈ విషయం అన్ని పార్టీలకు అనుభవమే. అందుకే ప్రభుత్వ ఉద్యోగులతో పాలకులు ఎప్పుడు మంచి సంబంధంతోనే వుండే ప్రయత్నం చేస్తాయి. కాదని కటువుగా వ్యవహరిస్తే దానికి ఫలితాలు చవి చూస్తాయి. ఇది చరిత్ర చెప్పిన నిజం. పాలకులు, ఉద్యోగులు సోదర భావంతో సాగితేనే ప్రజలకు సమస్యలు తీరుతాయి. అందుకే సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఉద్యోగుల సహాయం, సహకారం కోరుతున్నారు. తన లక్ష్యం వారికి వివరించారు. ప్రాధాన్యతలు చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగుల అండతో మరోసారి అధికారంలోకి వస్తామన్న విశ్వాసం ఆయన గట్టిగా చెప్పారు. అంటే రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు మరిన్ని తీపి కబుర్లు అందించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు చేస్తున్నారన్న మాట. అదే జరిగితే తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల పంట పండినట్టే. తెలంగాణ ప్రజలకు మంచి రోజులు వచ్చినట్టే...



- జీ. వెంకటరమణ,
సీనియర్ జర్నలిస్ట్.

# సర్‌తో సంకటం...



ఆద మరిస్తే అంతే సంగతులు... మీ పదవులకు కూడా ఇంతే సంగతులు. తస్మాత్ జాగ్రత్త. తిని ఇంట్లో టీవీ చూస్తూ, కబుర్లు చెప్తూ కాలక్షేపం చేస్తే కుదరదు. ఇప్పుడు ప్రతీ క్షణం అమూల్యమైంది. ప్రతీ గంట అవసరమైంది. ప్రతీ రోజు అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికి అప్పుడు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు గమనించాలి. తప్పులు జరుగుతుంటే తక్షణమే స్పందించాలి. ఇంతగా ఎందుకు చెప్తున్నామో అర్థం చేసుకోండి. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని వదిలి పెట్టం. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అందరు ఓటర్ల జాబితా సవరణపైన దృష్టి పెట్టాల్సిందే. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. ఎవరికీ వారే రంగంలోకి దిగాలి. బాధ్యతగా అడుగులు వేయాలి. మన ఓట్లు ఒక్కటి అంటే ఒక్కటి కూడా పోకుండా చూసుకోవాలి... ఇది తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలకు ఇచ్చిన వార్నింగ్. ఓటర్ల జాబితా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే పదవులు వుండవు. ఊడుతాయి. అంటూ కూడా ఆయన గట్టిగానే చెప్పేసారు. మేం గొప్పా అంటే మేం గొప్పా, మేం ప్రజా ప్రతినిధులం అంటూ తప్పుకునే చేష్టలు చేస్తే దానికి ఫలితం అనుభవించాలి. జాగ్రత్త. అంటూ కూడా చెప్పేశారు రేవంత్. ఓటర్ల జాబితా సవరణపైన ఎంత అలర్ట్ గా ఉంటే అంత మంచిది అన్న మెసేజ్ పార్టీ క్యాడర్ కు. లీడర్లకు సీఎం వివరించారు. ఇప్పుడు వేరే పనులు ఏవి పెట్టుకోవాల్సిన అవసరం లేదని, క్షేత్ర స్థాయి నుంచి ప్రతీ లీడర్ ఓటర్ల జాబితా సవరణ అంశం పరిశీలన ఒక్కటే గమనిస్తే చాలని, ఇదే పెద్ద పని అని సీఎం అనటంతో ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నేతలు, క్యాడర్ రంగంలోకి దిగేందుకు సిద్ధం అయ్యారు.

సీఎం రేవంత్ కాంగ్రెస్ పార్టీ లీడర్లకు ఇంతగా క్లాస్ తీసుకోవటం వెనుక బలమైన కారణం వుంది. తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్రియ మొదలైంది. దీనిపై కాంగ్రెస్ లీడర్లకు టీపీసీసీ దిశానిర్దేశం చేసింది. అయినా క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ లీడర్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఖచ్చితమైన నివేదికలు అందాయి. అంతే. ఇక ఆలస్యం చేయకుండా సీఎం రేవంత్ రంగంలోకి దిగారు. ఎక్కడెక్కడ నిర్లిప్తతతో నేతలు వున్నారో వారిని గట్టిగా మందలించారు. ఈ విషయంలో మంత్రులను కూడా ఆయన వదల్లేదు. ఓటర్ల జాబితా సవరణ అంశం సీరియస్ గా తీసుకోని మంత్రుల పదవులు ఊడి పోతాయాని కుండబద్దలు కొట్టారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర హోదాలో వున్న నేతలకు ఇదే హెచ్చరిక ఇచ్చేసారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన కోసం నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యంగా ఉంటే అక్కడ ఇన్‌చార్జీలను నియమించాలని, వారు పని చేయక పోతే ఇంకొకరికి ఆ బాధ్యతలు అప్పగించాలన్నారు. తనను ఓ నియోజకవర్గం ఇంచార్జ్ గా నియమిస్తే పని చేస్తానని చెప్పారు. ఇందులో భేషజాలకు అవకాశం ఎంతమాత్రం లేదని తేల్చి చెప్పారు.

సర్ ప్రక్రియపైన సీఎం రేవంత్ ఇంతగా ఆందోళన పడేందుకు అనేక సంఘటనలే కారణం. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రావటం వెనుక సర్ అంశం గట్టిగా పని చేసిందని కాంగ్రెస్ నమ్ముతోంది. ఇదే అక్కడ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పరాజయానికి దారి తీసిందని కాంగ్రెస్ అభిప్రాయం. ఇలాంటి పరిస్థితి తెలంగాణలో ఎదురుకాకుండా ఉండాలంటే సర్ ప్రక్రియపైన పూర్తి నజర్ అవసరం అంటారు కాంగ్రెస్ అగ్రనాయకులు. ఇందులో ఏ మాత్రం అలక్ష్యం వున్నా వచ్చే ఎన్నికల్లో ఫలితాల పై దాని ప్రభావం తప్పకుండ ఉంటుందని కాంగ్రెస్ అగ్ర నేతలు అంచనా వేస్తున్నారు. అందుకే ఇప్పుడు సీఎం తన పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర లీడర్లను ఇంత గట్టిగా నమ్మిస్తున్నారు. అసలు సర్ పై ఇంత ఆందోళన పార్టీలలో ఎందుకు మొదలు అయింది. ప్రజలు తమ ఓటు వుందో, లేదో వాళ్ళే చూసుకుంటారు కదా? అనే సందేహం కూడా కొందరికి వస్తోంది. అంత ఓపిక, తీరిక ప్రజలకు ఎక్కడిది. ఇంటికి వచ్చి ఓటరు జాబితాలో పేర్లు అడిగితేనే విసుక్కునే పరిస్థితి ప్రజలది. ఇక ఎన్నికల సమయంలో ఓటరు స్లిప్ ఇంటికి వచ్చి ఇచ్చినా ఓటు వేసేందుకు బద్దకించే వాళ్ళు వున్నారు. ఇది రాజకీయ పార్టీలకు బాగానే తెలుసు. అందుకే ప్రజల కన్నా పార్టీలే సర్ ప్రక్రియలో ఉత్సాహం చూపుతున్నాయి. ఇది ప్రస్తుతం జరుగుతున్న వాస్తవం.

తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి సర్ ఓ అగ్ని పరీక్షగా మారింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర లీడర్లు సర్ పై దృష్టి పెట్టాలని సీఎం హుకుం జారీ చేశారు. ఇక నేతలకా అంత ఓపిక లేదు. కానీ క్షేత్ర స్థాయి వరకు నేతలు సర్ ప్రక్రియ కాంగ్రెస్ నేతలు పట్టించుకుంటున్నారో, లేదో తెలుసుకోవటానికి ప్రత్యేక నిఘా సీఎం ఏర్పాటు చేసారంటూ ఇప్పుడు కాంగ్రెస్ నేతల్లో ఓ టాక్ వుంది. ఇదే వారిలో గుబులు పుట్టిస్తోంది. సర్ పై కంగారు మాట ఎలా వున్నా ఇప్పుడు కాంగ్రెస్ నేతల్లో మాత్రం కలవరం మొదలు అయింది. ఎవరికీ వారే వీధుల్లో తిరిగి ఓట్ల పరిశీలన ఎలా జరుగుతోందో తెలుసుకోవటానికి సిద్ధమవుతున్నారు. సర్ పరిశీలన కోసం అధికారులు ఏ ప్రాంతాలకు వెడుతున్నారు? ఏ ఇంటి ఓటర్ల జాబితా ఇప్పుడు వారి చేతుల్లో వుంది తెలుసుకునేందుకు కొందరు కాంగ్రెస్ నేతలు తంటాలు పడుతున్నారు.

సర్ అంశం పైన రాజకీయ పార్టీ నేతల్లో బిన్నాభిప్రాయాలున్నాయి. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అత్యంత కీలకమైంది. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వ్యవస్థ మనది. 18 సంవత్సరాల వయసు వున్న వారికి ఓటు హక్కు లభిస్తుంది. ఓటు హక్కు పొందిన కోట్ల మంది ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం ఓ విధానం. ఇదే ప్రభుత్వం ఏర్పాటుకు కీలకం అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు ఎన్నికల సంఘం ఓ అనూహ్య విధానం మొదలు పెట్టింది. ఒక వ్యక్తికి ఒకే చోటు ఓటు ఉండాలి. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా ప్రక్రియ మొదలు పెట్టింది. గతం లో ఓట్ల కోసం ఇష్టం వచ్చినట్లు రాజకీయ పార్టీలు నమోదు చేసిన పేర్లు, చని పోయిన వారి పేర్లు, అనర్హుల పేర్లు, రెండు మూడు ప్రాంతాల్లో ఓటర్ల జాబితా పేర్లు వున్న వారిని గుర్తించి వాటిని తొలగించడం శరవేగంగా చేస్తోంది ఎన్నికల సంఘం. ఇక సరైన గుర్తింపు లేకుండా ఓటర్ల జాబితాలో వున్న పేర్లు కూడా తొలగించడం మొదలు పెట్టింది. ఇక్కడే రాజకీయ పార్టీలకు మంట పుడుతోంది. ఎన్నికల అధికారులు ఇష్టం వచ్చినట్టు పేర్లు తొలగించి కొన్ని పార్టీలకు కొమ్ము కాస్తున్నాయంటూ ఆరోపణలు ప్రబలి పోయాయి. సర్ ప్రక్రియ జరిగిన కొన్ని రాష్ట్రాల్లో అప్పటి వరకు అధికారంలో వున్న పార్టీలు ఎన్నికల్లో అధికారం కోల్పోయిన నేపథ్యంలో సర్ పైన అనుమానం ఎక్కువ అయింది. అదే ఇప్పుడు రాజకీయ పార్టీలకు వణుకు పుట్టిస్తోంది. తమ పార్టీ అభిమానుల ఓట్లు పోకుండా చూసుకోవటం అత్యంత అవసరంగా ఇప్పుడు పార్టీలు భావిస్తున్నాయి. సర్ పైన అప్రమత్తం అయ్యాయి.

సర్ ప్రక్రియ ద్వారా ఇప్పటికే దేశంలో కోట్ల సంఖ్యలో బోగస్ ఓట్ల తొలగించిన ఈసీ పార్టీలకు షాక్ ఇచ్చింది. దింతో పార్టీలు ఆలోచనలో పడ్డాయి. అసలు ఏ ప్రాతిపదికన ఓట్ల తొలగింపు జరుగుతుందో తెలుసుకుంటూ జాగ్రత్త పడుతున్నాయి. సరైన గుర్తింపు కార్డులు లేక, పోవటం, చిరునామాల మార్పులు, వయసులో తేడాలు, ఫోటోలు.. ఇలాంటి లోపాలు వున్న ఓటర్ల పేర్లుతో పాటు, అసలు మనుషులు లేకుండా నమోదు అయిన పేర్లు కూడా ఓటర్ల జాబితాలో ఉన్నట్టు సర్ లో వెలుగులోకి వస్తున్నాయి. తమిళనాడు, బెంగాల్ తో పాటు పలు రాష్ట్రాల్లో సర్ తర్వాత జరిగిన ఎన్నికలు సంచలనం రేపాయి. బలమైన పార్టీల నుంచి ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులు ఓటమి మూట గట్టుకోవల్సి వచ్చింది. అంచనాల కు అందని ఈ పరిణామాలు రాజకీయ పార్టీల్లో సర్ పైన అనుమానం పెంచాయి. సర్ కు సంబందించిన అన్నీ సందేహాలు ఎన్నికల కమిషన్ ఎప్పటికి అప్పుడు పరిష్కారం చేస్తున్నా పార్టీలు మాత్రం ఏదో జరుగుతోంది అనే రీతిలో భయ పడుతూనే వున్నాయి.

సర్ కొత్తదేమి కాదు. గతంలోనూ ఎన్నికల జాబితాలో తప్పిదాలు ఉంటే సరిచేసే పద్ధతి ఉండేది. ఇప్పుడు అది ఇంకొద్ది లోతుగా జరుగుతోంది. సర్ తో ఎక్కడ తమ మద్దతుదారుల ఓట్లు పోతాయో అనే ఇప్పుడు పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. తెలంగాణలో ఇప్పుడు సర్ పై రాజకీయ పార్టీలు చేస్తున్న హడావిడి అంతా, ఇంతా కాదు. దీని కోసం ప్రత్యేక కమిటీలు, ఇంచార్జ్‌లు, పర్యవేక్షణ ఇలా పార్టీలు పరుగులు పెడుతున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ కూడా ఇదే చేస్తోంది. సర్ వల్ల ఓట్లు పోకుండా చూసుకునే బాధ్యతలు ఇప్పుడు కాంగ్రెస్ సీరియస్ గా తీసుకుంది. 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమాగా చెప్పేస్తున్న సీఎం రేవంత్ సర్ అందుకు అడ్డంకి కాకుండా జాగ్రత్త పడుతున్నారు. అందుకే ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఎమ్మెల్సీలకు, నేతలకు గట్టిగా అక్షింతలు వేశారు. నిజానికి జరుగుతున్నది కూడా అదే. సర్ పై రాష్ట్ర బీజేపీ చూపుతున్న శ్రద్ధలో ఒక వంతు శ్రద్ధ కూడా కాంగ్రెస్ నేతలు చూపటం లేదన్నది వాస్తవం అంటున్నారు క్యాడర్. ఇదే సీఎం కోపానికి కారణం అంటున్నారు వాళ్ళు. సీఎం రేవంత్ ఎందుకు ఇంత సీరియస్ గా సర్ పై సూచనలు చేస్తున్నారో ఇప్పుడిప్పుడే పార్టీ నేతలు అర్థం చేసుకుంటున్నా, ఇంకా రంగంలోకి మాత్రం దిగలేదు. సర్ పై కాంగ్రెస్ పార్టీ ఏకంగా శిక్షణ శిబిరాలు కూడా ఏర్పాటు చేసి జాగ్రత్తలు వివరిస్తోంది. దీన్ని లీడర్లు, క్యాడర్ ఎంత మేరకు అంది పుచ్చుకుని జాగ్రత్తలు తీసుకుంటాయి అనేది చూడాలి. సీఎం రేవంత్ సర్ పై ఓ కన్ను వేసి ఉంచారు. అదే స్థాయిలో లీడర్లు కూడా ఇప్పుడు కదలాలి అన్న సీఎం ఆదేశాలు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎంత మేరకు పాటిస్తారో... సర్ పై ఎలాంటి నజర్ వేస్తారో? చూడాలి మరి...!

- జీ. వెంకటరమణ,
సీనియర్ జర్నలిస్ట్.




## 35 తర్వాత గర్భధారణ..
# సరైన జాగ్రత్తలతో సురక్షితమే

- కెరీర్ కారణంగా ఆలస్యంగా మాతృత్వాన్ని ఎంచుకుంటున్న మహిళలు
- ముందస్తు ఆరోగ్య పరీక్షలు, వైద్యుల పర్యవేక్షణ కీలకం
- సమతుల్య ఆహారం, ఫోలిక్ యాసిడ్‌తో ప్రమాదాలు తగ్గే అవకాశం

**ఇటీవలి కాలంలో చదువు, ఉద్యోగం, కెరీర్, ఆర్థిక స్థిరత్వం వంటి కారణాల వల్ల చాలామంది మహిళలు వివాహంతో పాటు మాతృత్వాన్ని కూడా కొంత ఆలస్యంగా ఎంచుకుంటున్నారు. దీంతో 35 ఏళ్ల తర్వాత గర్భం దాల్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆ వయసులో గర్భధారణ సురక్షితమేనా అనే ప్రశ్న చాలా మందిలో ఉత్పన్నమవుతోంది.**

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, 35 ఏళ్ల తర్వాత కూడా ఆరోగ్యకరమైన గర్భధారణ సాధ్యమే. అయితే ఈ దశలో తల్లి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. గర్భం దాల్చే ముందు పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, ఇప్పటికే ఉన్న వ్యాధులు ఉంటే వాటిని నియంత్రణలో ఉంచుకోవడం ఎంతో ముఖ్యం.

వయసు పెరిగే కొద్దీ అండాల నాణ్యత, సంఖ్య సహజంగానే తగ్గుతాయి. అందువల్ల గర్భం దాల్చేందుకు కొంత ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సంతానోత్పత్తి నిపుణుల సలహా కూడా అవసరమవుతుంది.

ఈ వయసులో గర్భధారణ సమయంలో మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు, ప్రీఎక్లాంప్సియా వంటి సమస్యలు వచ్చే ప్రమాదం కొంత ఎక్కువగా ఉండవచ్చు. అలాగే జన్యుపరమైన లోపాల ప్రమాదం కూడా వయసుతో పాటు పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

గర్భధారణకు ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం వల్ల శిశువులో పుట్టుకతో వచ్చే కొన్ని లోపాల ప్రమాదాన్ని తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అదనంగా ఐరన్, కాల్షియం, విటమిన్‌డి వంటి పోషకాలు కూడా వైద్యుల సూచన మేరకు తీసుకోవడం మంచిది.

సమతుల్య ఆహారం, తగిన నిద్ర, తేలికపాటి వ్యాయామం, ఒత్తిడిని తగ్గించే జీవనశైలి గర్భధారణను మరింత ఆరోగ్యకరంగా మార్చడంలో సహాయపడతాయి. ధూమపానం, మద్యం వంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అలాగే గర్భం దాల్చిన తర్వాత క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించడం, అల్ట్రాసౌండ్‌లు, రక్త పరీక్షలు వంటి అవసరమైన పరీక్షలను సమయానికి చేయించుకోవడం చాలా ముఖ్యం. ఏవైనా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సలహా తీసుకోవాలి.

**మొత్తానికి, 35 ఏళ్ల తర్వాత గర్భం దాల్చడం ప్రమాదకరం అనే అపోహ పూర్తిగా నిజం కాదు. సరైన ప్రణాళిక, ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పని వైద్య పర్యవేక్షణతో ఈ వయసులో కూడా తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉండే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.**



## కొమ్ముగూడెం లో యువతకు టైలరింగ్‌లో శిక్షణ

- శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ కల్తి భద్రయ్య

**కారేపల్లి, మహా**: ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో యువతకు ఉపాధి శిక్షణలో భాగంగా యువ శిక్షణ కేంద్రం ఇల్లందు వారిచే సింగరేణి మండల పరిధిలో ని కొమ్ము గూడెం టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ శిబిరాన్ని సర్పంచ్ కల్తి భద్రయ్య శుక్రవారం ప్రారంభించారు ఈ శిక్షణ కేంద్రంలో యువతుల కు అడ్వాన్స్ కుట్టు పని, బ్లౌజ్ డిజైనింగ్ ఎంబ్రాయిడ రీ, డ్రెస్ మేకింగ్ పై శిక్షకులు ట్రైనింగ్ ఇస్తున్నారు శిక్షణార్థులకు సర్పంచ్ కల్తి భద్రయ్య శిక్షణా మెటీరియల్ ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన యువతులకు సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపటం ఈ శిక్షణ ఉద్దేశమన్నారు ఈ కార్యక్రమంలో కారేపల్లి సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్, గ్రామపంచాయతీ సెక్రటరీ జి లోకేశ్వరి, వైటీసీ మేనేజర్ సన్నీ, శిక్షకులు విజయకుమారి, చైతన్య కుమార్, మల్లయ్య, వార్డ్ నెంబర్ పెనక నాగేష్, కరపటి భవాని తదితరులు పాల్గొన్నారు



## మృతుని కుటుంబానికి సీపీఎం వితరణ

**కారేపల్లి, మహా**: సింగరేణి మండల పరిధిలోని ఎర్ర బోడు గ్రామానికి చెందిన తగరం వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరయ్య కుటుంబం దళిత పేద కుటుంబం కావడంతో వారు జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎర్రబోడు సీపీఎం గ్రామశాఖ రూ.4700 లను శుక్రవారం కుటుంబానికి అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు వజ్జా రామారావు మాట్లాడుతూ సీపీఎం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని, బాధితుల కు, నిర్వాసితులకు సిపిఎం కార్యాలయాలు సంరక్షణ శిబిరాలు గా నిలబడుతున్నాయని తెలిపారు. ఎర్రబోడు సీపీఎం గ్రామ శాఖ బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పండగ కొండయ్య, ఎర్రబోడు శాఖ కార్యదర్శి కుర్సం శీను, నాయకులు బోజడ్ల గోవిందరావు, కాటేపల్లి నవీన్ చరప వీరస్వామి, సుంకర నరేష్, కుందనపల్లి పవన్, కనికరపు వెంకటేశ్వర్లు, పండగ పుల్లారావు, గాదే నాగయ్య, మెంతిన్ని తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎన్యూమరేషన్ లో ఓటర్లు తమ పూర్తి వివరాలను నమోదు చేయాలి

- ఐటిడిఏ పిఓ రాహుల్

**బూర్గంపహాడ్, మహా** : భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా పారదర్శకత కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభమైనందున బి ఎల్ వో లు, సూపర్వైజర్లు అందించిన ఎన్యుమరేషన్ ఫారంలలో ఓటర్లు తమ పూర్తి వివరాలు నమోదు చేసి బి ఎల్ ఓ సూపర్వైజర్లకు అందించాలని 110( ఎస్ టి) పినపాక నియోజకవర్గం ఈ ఆర్ ఓ ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఓటర్లకు సూచించారు.శుక్రవారం బూర్గంపహాడ్ మండలంలోని బూర్గంపహాడ్ 233,వీరవెండి191, మోతే 189 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు సంబంధిత ఓటర్లకు అందించి ఓటర్లకు పలు సూచనలు అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ అంటే కేవలం ఓటర్ల జాబితా సవరణ మాత్రమే అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడానికి, జాబితాలోని తప్పులను సరిదిద్దడం దీని ముఖ్య ఉద్దేశం అని, ఓటర్లు బిఎల్వోలు మరియు సూపర్వైజర్లు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకొని కుటుంబంలోని అర్హులైన ప్రతి ఒక్కరి పూర్తిస్థాయి వివరాలు ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయించి తిరిగి బిఎల్ఓలకి అందించినప్పుడు తప్పని సరిగా రసీదు తీసుకోవాలని అన్నారు. సంబంధిత ఓటర్లు సర్ ఓటర్ జాబిత ప్రక్రియలో ఓటు నమోదు చేయించుకోవడానికి ఎటువంటి అనుమానాలు, భయాందోళనలు పెట్టుకోవద్దని, ఈ సర్వే ద్వారా మరణించిన వారి పేర్లు వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న డూప్లికేట్ ఓట్లను తొలగిస్తారని, ఇంటింటి సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు నేరుగా ప్రతి ఓటరు ఇంటికి వచ్చి వివరాలను వెరిఫై చేస్తారని, ఇది కేవలం ఓట్ల సవరణ ప్రక్రియ మాత్రమేనని, అర్హులైన వారి ఓట్లను ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించబోరని, అందుకు బి ఎల్ వో లకు సంబంధిత ఇంటి యజమానులు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారంలో మీ ఇంటిలోని సభ్యుల అర్హులైన వారి అందరి వివరాలను అందించి సహకరించాలని అన్నారు.అనంతరం బిఎల్ఓ లకి, సూపర్వైజర్లకి సూచనలు ఇస్తూ ప్రతి ఇంటింటికి తిరిగి తప్పనిసరిగా ఇంటి సభ్యుల పూర్తి వివరాలు ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, బిఎల్వోలు పద్మ, దీపిక, శ్రీలక్ష్మి, మేరీ, చందు తదితరులు పాల్గొన్నారు.

## సభా స్థలిని పరిశీలించిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి

**డాక్టర్ వన్నాల వెంకటరమణ**

**వరంగల్ పోచమ్మ మైదాన్, మహా** : బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఓరుగల్లు పర్యటన సందర్భంగా శుక్రవారం వరంగల్ జిల్లాలో సభా స్థల పూజ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొని కొబ్బరికాయ కొట్టి పూజా అనంతరం సభ స్థల పనులను పరిశీలించారు. ఈనెల 29వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పర్యటించనున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంజిత్ , జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, బిజెపి సీనియర్ నాయకులు రమణ రెడ్డి , త్రిలోక్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై మహా యుద్ధం

- వరంగల్ లో 2కే రన్‌కు భారీ స్పందన
- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యేలు, కుడా చైర్మన్, వరంగల్ సీపి, జిల్లా కలెక్టర్



**వరంగల్, హన్మకొండ మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సే నో టు డ్రగ్స్ కార్యక్రమంలో భాగంగా "సే నో టు డ్రగ్స్ యెస్ టు లైఫ్" అనే నినాదంతో మాదకద్రవ్యాల నిర్మూలన, యువతలో చైతన్యం కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ నగరంలో భారీ 2కే రన్ నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ లో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్, కె.ఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి తో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీ నగర ప్రధాన వీధుల మీదుగా హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు కొనసాగింది.మాదకద్రవ్యాలు వద్దు ఆరోగ్యమే ముద్దు, డ్రగ్స్ ఫ్రీ వరంగల్ వంటి నినాదాలతో విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలన పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజపాయి, ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి దార కవిత, డిసిపి అంకిత్ కుమార్, పలువురు జిల్లా అధికారులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీ లో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ముగింపు సభలో 2కే రన్ విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సంప్రిత్ సింగ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా నాశనం చేస్తాయని అన్నారు. యువత చెడు స్నేహాలు, క్షణిక ఆనందం కోసం డ్రగ్స్‌కు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని, ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. నాగరాజు మాట్లాడుతూ, డ్రగ్స్ సమస్య కేవలం పోలీసు శాఖదే కాకుండా సమాజం మొత్తానికి సంబంధించినదని అన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు అందరూ కలిసి యువతను క్రీడలు, యోగా,వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించాలి

**సీపీఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డుకు సంబంధించిన పేదలకు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం 60 గజాల ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది అప్పటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వం వారికి ఇళ్ల జాగలు చూపించలేదు ఇళ్ల జాగలు చూపించాలని హిమాయత్ నగర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షకు సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది ఈ సందర్భంగా సీపీఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య నాయకత్వన హిమాయత్ నగర్ కు సంబంధించిన పేదలు 290 మందికి ఇంటి జాగలు కేటాయిస్తూ మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి సమక్షంలో కెసిఆర్ కాలనీ ఏర్పాటుకు శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయినా పేదలకు ఇళ్ల జాగాలు చూపించలేదు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల జాగలను గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డుకు కేటాయించడాన్ని సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సర్వే నంబర్ 177, 176 లలో గుడిమల్కాపూర్ యార్డు ఏర్పాటు అవుతుందని ప్రకటించారు దానికి విరుద్ధంగా సర్వేనెంబర్ 151లో మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని చూడడం జిల్లా కలెక్టర్ మొయినాబాద్ ఎమ్మార్వో కు తగదన్నారు. మొయినాబాద్ మండల పరిధిలో ప్రభుత్వ అసైన్డ్ భూములు రాజకీయ నాయకులు, బడా బాబులు అనేకమంది కబ్జాలు చేశారని వాటిని సర్వే చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మండల ఎమ్మార్వో ను డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా రెవెన్యూ యంత్రాంగం పేదలకు ఇళ్ల జాగలు చూపించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, నాగిరెడ్డి గూడ గ్రామ కార్యదర్శి ముంజ గళ్ళ ప్రభుదాస్ హిమాయత్ నగర్ యువజన సంఘాల అధ్యక్షులు కట్టమీద శ్రీను, కుమ్మరి విఠల్ కరీం గోపాల్ నాయక్ గ్రామ పెద్దలు ఇళ్ల పట్టాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సేవాలాల్ మహారాజ్, జగదాంబ ఆలయాల భూమి పూజ

**పాలకుర్తి,జూన్ 26 మహా** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని రాజీవ్ తండాలో బుధవారం సేవాలాల్ మహారాజ్ మరియు జగదాంబ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుద్దిల్లా శ్రీను బాబు విచ్చేసి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి గురువు శేఖర్ మహారాజ్ విచ్చేసి,శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.సేవాలాల్ మహారాజ్, జగదాంబ తల్లికి భక్తులు ఘనంగా పూజలు చేశారు. మాజీ ఉప సర్పంచ్ జ్యోతి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఇస్లావత్ వనిత శంకర్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య దంపతులు, పెద్దపల్లి చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య, తండా సర్పంచ్ అఖిల అంజి నాయక్ దంపతులు, ఫుట్ బాల్ చైర్మన్ అసంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే తండా నాయక్, కెల్డన్ నాయక్, సారయ్య, శక్లల్, శ్రీనివాస్, సమ్మయ్య, ఉప సర్పంచ్ రాజేశ్వరి సారయ్య, వార్డ్ సభ్యులు తిరుపతి, పులచంద్, గట్టయ్య, చందు, రాజు, శ్రీను, తిరుపతి, సమ్మయ్య, సురేష్, రమేష్,కిరణ్, సమ్మయ్యలతో పాటు పలువురు మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందించారు.



## ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రతి ఇంటికి చేరాలి

- బీఎల్ఓలు ప్రతి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలి
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్....

**రాజేంద్రనగర్ మహా;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ నివాసంలో బిఎల్ఓ లతో కలిసి రాజేంద్రనగర్ తహశీల్దార్ బొమ్మ రాములు శుక్రవారం (ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ సార్ ప్రక్రియ) ఎన్యూమరేషన్ ఫామ్ ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటరుకు (ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ సార్ ప్రక్రియ ) సంబంధించిన ఎన్యూమరేషన్ ఫామ్ అందజేయాలన్నారు. ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫామ్ ను మ్యాపింగ్ అయినట్లయితే అన్ని సరిగా ఉన్నాయా, లేదా సరిచూచికొని సంతకము చేసి పోటో అతికించి బి యల్ ఓ కు అందజేయాలన్నారు. మ్యాఫింగ్ కాని వారు 2002 ఓటరు జాబితాలో పేరు చూసుకుని ఎన్యూమరేషన్ ఫామ్ ను పూర్తి గా నింపి పోటో జతచేసి సంతకం చేసి అందజేయాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫామ్ నింపే ప్రక్రియలో ప్రజా ప్రతినిధులు ప్రజలకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బొమ్మ రాములు మాట్లాడుతూ బి.యల్.ఓ ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫామ్ అందజేసెటట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపినారు. ప్రతి 10 మంది బి యల్ ఓ లకు ఒక సూపర్వైజర్ ను నియమించినట్లు తాసిల్దార్ బొమ్మ రాములు తెలిపారు. కార్యక్రమంలో బి యల్ ఓ రాహుల్ రెడ్డి, బి యల్ ఓ సూపర్వైజర్ మౌనిక ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణను... ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదాం

**జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య**

**కుషాయిగూడ, మహా :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను ఆదర్శవంతంగా తీర్చి దిద్దుదామని ఇందుకోసం ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని మాజీ మేయర్ మేకల కావ్య పిలుపునిచ్చారు. జవహర్ నగర్ కేవీఆర్ కాలనీలో ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ బిఎల్ఏ లతో కలిసి మాజీ మేయర్ మేకల కావ్య పార్టీ అధ్యక్షుడు కొండల ముదిరాజ్ సమక్షంలో ఓటర్లను కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించేందుకు బిఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ప్రక్రియ అన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయడంతో పాటు ఉన్న మృతి చెందిన అనర్హుల పేర్లు తొలగించడం పొరపాట్లను సరిచేసి ఖచ్చితమైన ఓటరు జాబితాను సిద్ధం చేయడం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ చారి, సింగన బాల్రాజ్ పటేల్, వెంకటేష్, సిద్ధులు యాదవ్, కృష్ణ యాదవ్, బీఎల్ఓ లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## 29న కోటమైసమ్మ ఆలయంలో వేలంపాట

**కారేపల్లి, మహా :** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయల పల్లి శ్రీ కోట మైసమ్మ తల్లి ఆలయంలో ఏడాది కాలపరిమితి తో టెంట్ సామాను కిరాయికి ఇచ్చుకోవడానికి, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి వేలం పాటను ఈనెల 29వ తారీఖున నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ పట్టాభి రామారావు, అలయ ఈవో కే. వెంకటయ్య తెలిపారు. జూలై 1వతేది నుండి 31జూన్2027 కాలపరిమితి తో కోట మైసమ్మ తల్లి ఆలయ పరిసరాలలో టెంట్ సామానుల నిర్వహణ, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. టెంట్ హౌస్ నిర్వాణ కోసం రూ.లక్ష, కొబ్బరి చిప్పల కోసం రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్న గలరని తెలిపారు. కొబ్బరి చిప్పల పోగుకు జాతర సమయంలో 20 రోజులు అవకాశం లేదన్నారు. ఆ సమయంలో వేరే టెండర్ అమలులో ఉంటుందని తెలిపారు.



## పాలకుర్తిలో రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

**పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి ఏవో బండి ప్రమోద్ కుమార్**

**పాలకుర్తి, జూన్ 26 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన అర్హులైన రైతుల 'రైతు భరోసా' పథకం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత జూన్ 15, 2026 నాటికి భూ భారతి/ ధరణి పోర్టల్ ఆధారంగా కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆయన స్పష్టం చేశారు. అలాగే, పాత లబ్ధిదారులలో ఎవరికైనా బ్యాంక్ ఖాతా వివరాల్లో మార్పులు ఉంటే, వారు కూడా సంబంధిత ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.అర్హులైన రైతులు నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు మరియు బ్యాంక్ పాస్ బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీలను జత చేసి, ఈ నెల జూలై 5వ తేదీలోపు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారులకు AEO అందజేయాలని సూచించారు.ఇప్పటికే రైతు భరోసా పథకంలో నమోదై ప్రయోజనం పొందుతున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఏఓ స్పష్టం చేశారు. రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా, ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### తహసీల్దార్ ఇక్బాల్‌పై ఆరోపణలు

## అవాస్తవం: లోక్‌సత్తా

**వరంగల్, మహా:** ఖిలా వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్‌పై ఇటీవల కొన్ని ప్రచార మాధ్యమాలు, మీడియా వేదికల్లో వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ జిల్లా కార్యదర్శి ఇనుముల రమేష్ స్పష్టం చేశారు. పేదలు, రైతులు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ న్యాయబద్ధంగా విధులు నిర్వహిస్తున్న అధికారిని కావాలనే కొందరు లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు.భూ కబ్జాలు, అక్రమ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు అడ్డుగా నిలుస్తున్నందున కొందరు భూ కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తహసీల్దార్ ఇక్బాల్‌ను బదిలీ చేయించాలనే ఉద్దేశంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం ఒక నిజాయితీ అధికారిపై దుష్ప్రచారం చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. ఇక్బాల్ ఎప్పటిలాగే నిబద్ధతతో ప్రజలకు సేవలు అందిస్తూ పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లోక్‌సత్తా ఆకాంక్షించింది. ఆయనపై వస్తున్న అన్యాయ ఆరోపణలను ఖండిస్తూ, వాస్తవాలను పరిశీలించి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ వరంగల్ జిల్లా యూనిట్ కోరింది



# బాధలో బాసటగా..
# కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్ మహా** : ఆపదలో ఉన్నా , అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసినా , ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నారని సమాచారం అందినా వారి నివాసాలకు వెళ్ళి కొండంత అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.శుక్రవారం ఆయన బేల మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. పాటన్ గ్రామంలో ఇటీవల మడావి నిఖిల్ , బేల కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ కుమారుడు మృతి చెందారు. వారి నివాసాలకు వెళ్ళిన కంది శ్రీనివాస రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అలాగే బెదోడ గ్రామానికి చెందిన బేదొడ్కర్ విజయ్ పటేల్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందడంతో ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, బేల మండల అధ్యక్షులు రూప్ రావు వంకడే, సర్పంచులు గేడం గులాబ్, శంకర్ భోక్రె, బేల మండల్ ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులు సాగర్ టాక్రె, ఉపసర్పంచ్ బట్టు రాజు, మాజీ జెడ్పిటిసి రాందాస్ నాక్లే , నానాజీ వైద్య విట్టల్ రెడ్డి, షఖిల్, దేవిదాస్ , తదితరులున్నారు..




# జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా**: మంచిర్యాల జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డి.సి.పి. ఎ భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, గుడిపేట 13వ పటాలం కమాండెంట్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి, యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని అన్నారు. ప్రజలందరం సమిష్టిగా కృషి చేసి మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని ఆయన పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. అనంతరం డి.సి.పి. భాస్కర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు అనుమానాలు ఉంటే వెంటనే డయల్ 100లో సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికై యువత నడుం బిగించాలి

- మత్తు పదార్థాల నివారణపై 2 కె రన్ ను నిర్వహించిన బెల్లంపల్లి వన్టౌన్ సిఐ శ్రీనివాసరావు

**బెల్లంపల్లి, మహా**: డ్రగ్స్ రైతు సమాజ నిర్మాణానికి యువత నడుం బిగించాలని వన్ టౌన్ సిఐ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు తిలక్ రోడ్ స్టేడియంలో 2కే రన్ ను బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.సీపీ రామగుండం ఆదేశాల మేరకు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు, యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బెల్లంపల్లి పట్టణంలో 2కె రన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ వి. కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బెల్లంపల్లి 1 టౌన్ సీఐ కె. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో తిలక్ స్టేడియం నుండి కంటా చౌరస్తా వరకు రన్ కొనసాగింది.ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ శ్రీనివాసరావు లు సంయుక్తంగా మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, ఉపాధిపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని సూచించారు. మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో తిలక్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, యువత, బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**భాజపా పార్టీ ఎస్ఐఆర్ స్టేట్ ఇన్చార్జి ఆందోని రెడ్డి**



**బెల్లంపల్లి, మహా:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని భాజపా పార్టీకి చెందిన ఎస్ఐఆర్ స్టేట్ ఇన్చార్జి ఆందోళన రెడ్డి వెల్లడించారు.శుక్రవారం నాడు భారతీయ జనతా పార్టీ బెల్లంపల్లి పట్టణంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి స్టేట్ ఇంచార్జ్ ఆంథోనీ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే అమ్మురాజుల శ్రీదేవి తో కలిసి క్షేత్రస్థాయిలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి బజార్ ఏరియాలో బూత్ లో బిఎల్ఓ ఉమాదేవి, శ్రీమతి తో కలిసి ఎన్యుమరేషన్ ఫార్మ్స్ ఇవ్వడం జరిగింది. ఓటర్లకున్న సందేహాలు కూడా వివరించారు.ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ పులగం తిరుపతి, భాజపా బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ధార కళ్యాణి, కాజీపేట మండల అధ్యక్షులు సూరం సంపత్, భీమిని అధ్యక్షులు కొంక సత్యనారాయణ నెన్నెలా అధ్యక్షులు అంగళి శేఖర్, బెల్లంపల్లి రూరల్ అధ్యక్షులు రాజ్ కుమార్, సీనియర్ నాయకులు బుర్రెడ్ల కేశవరెడ్డి, మద్దర్ల శ్రీనివాస్, ఉప్పుల మోహన్, వడ్నాల స్వామి, గోమాస కమల, నల్లుల సంగీత, కల్లపల్లి నవీన్, ఎరుకల నర్సింగ్, ఆకుల శంకర్, కనకం శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు బాసబోయిన యుగేందర్, సోషల్ మీడియా కన్వీనర్ తోటపల్లి ఓం సాయి, ఎర్రోజు శ్రీనివాస్, పుల్లూరి రాము, బాగ్ మోహన్, ఇప్ప స్వామి కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.

# వరంగల్ బస్ స్టాండ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



మహా వరంగల్ బ్యూరో;వరంగల్ నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.75 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరంగల్ నూతన బస్ స్టాండ్ నిర్మాణ పనులను వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం ఆయన కుడా అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి నిర్మాణ స్థలాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వరంగల్ నగర సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. వరంగల్ పాత బస్ స్టాండ్ స్థానంలో అన్ని రకాల ఆధునిక హంగులు, ప్రయాణికులకు అవసరమైన సకల సదుపాయాలతో ఈ నూతన బస్ స్టాండ్ కాంప్లెక్స్ రూపు దిద్దుకుంటోందని తెలిపారు. గత కొంతకాలంగా వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన లేదా మందకొడిగా సాగుతున్న పనులను వేగవంతం చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చూడాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల్లో మరింత వేగం పెంచాలని సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలను, అధికారులను ఆయన ఆదేశించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్ బేలు, వెయిటింగ్ హాళ్లు, అత్యాధునిక రవాణా వసతులను సకాలంలో పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా నూతన బస్ స్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.వరంగల్ నగరాన్ని అద్భుతమైన ఐటి, పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో మెరుగైన రవాణా వ్యవస్థ ఎంతో కీలకమని, ఇందుకోసం కుడా ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.






# శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో బంగారం పట్టివేత


**రాజేంద్రనగర్ మహా** ; కౌలాలంపూర్ నుండి ఇద్దరు ప్రయాణికులు 246 న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంకి చేరుకున్నారు. అడ్వాన్స్ ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా అభివృద్ధి చేయబడిన ఇంటెలిజెన్స్, డిఆర్ఐ నుండి అందిన ఇంటలిజెన్స్ ఆధారంగా ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయు) అధికారులు కౌలాలంపూర్ నుండి వచ్చిన ఇద్దరు భారతీయ ప్రయాణికులను అనుమానంతో అడ్డగించి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ప్రయాణికులు ధరించిన ప్యాంటు నడుమ భాగంలో సెల్యులోస్ టేప్ తో ప్రత్యేకంగా కుట్టిన సంచులలో పేస్టు రూపంలో దాచిన బంగారాన్ని అధికారులు గుర్తించారు.వాల్యుయర్ పరీక్షించగా 24 క్యారెట్లు బంగారమని నిర్ధారించారు.2.271 కిలో బంగారం మార్కెట్లో దీని విలువ 3.36 కోట్లు ఉంటుందని ఎయిర్ ఇంటలిజెన్స్ అధికారులు తెలిపారు.కస్టమ్స్ 1962 చట్టం ప్రకారం అరెస్టు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

# అజంజాహి మిల్లు భూముల వేలంపై ఆగ్రహం



**వరంగల్, మహా:** వరంగల్ అజంజాహి మిల్లు భూములను ప్రభుత్వం వేలం వేయడంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేలాది మందికి ఉపాధి కల్పించిన చారిత్రక అజంజాహి మిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం నామరూపాలు లేకుండా చేసిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు మిల్లు స్థలంలోనే భూములు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు 318 మంది కార్మికుల హక్కులను కాలరాస్తూ వేలంపాటలకు సిద్ధమవడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ ఈ విషయంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన ప్రదీప్ రావు, కార్మికుల జీవనోపాధికి భంగం కలిగించే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.







# కస్టోడియన్ భూమిపై ల్యాండ్ మాఫియా కన్ను

- నివాస ప్రాంతాల మధ్య భారీ షెడ్లు..
- నిబంధనలకు విరుద్ధంగా త్రీ-ఫేస్ కరెంట్ మీటర్ల కేటాయింపు
- స్థానికుల ఆగ్రహం

**కుషాయిగూడ, మహా** : కాప్రా మండల పరిధిలోని రెవెన్యూ కార్యాలయం పక్కన, సాకేత్ టవర్స్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 11 భూమి అక్రమాలకు, భూ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా భారీ ఇండస్ట్రియల్ షెడ్లు వెలుస్తున్నా, వాటికి విద్యుత్ శాఖ అధికారులు యధేచ్ఛగా త్రీఫేస్ కరెంట్ మీటర్లు కేటాయిస్తుండటంపై స్థానికుల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడటంలో మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం లోపించడం ఆక్రమణదారులకు వరంగా మారింది. కాప్రా రెవెన్యూ కార్యాలయం పక్కనే ఉన్న సర్వే నంబర్ 11 లోని దాదాపు 3 ఎకరాలకు పైగా భూమి గతంలో 'కస్టోడియన్ ల్యాండ్' గా రికార్డుల్లో ఉంది. అయితే, ఈ భూమిపై రెవెన్యూ రికార్డుల పరంగా ల్యాండ్ అలటీస్ నుండి కొందరు వ్యక్తుల పేరిట టైటిల్ డీడ్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుండగా, అదే ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ మరియు నోటరీ పేపర్ల ద్వారా మరికొందరు వ్యక్తులు తామే యజమానులమంటూ చలామణి అవుతున్నారు. ఒకే సర్వే నంబర్ భూమికి సంబంధించి విభిన్న రకాల యాజమాన్య పత్రాలు సృష్టించబడటం ఇక్కడి భూ వివాదాల వెనుక ఉన్న రికార్డుల మాయాజాలాన్ని స్పష్టం చేస్తోంది. ఈ సర్వే నంబర్ చుట్టుపక్కల అంతా నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం జనవాసాల మధ్య కాలుష్యానికి, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే భారీ పరిశ్రమలు లేదా ఇండస్ట్రియల్ షెడ్ల ఏర్పాటుకు అనుమతులుండవు. గతంలో ఈ సర్వే నంబర్ లో భారీ ఇండస్ట్రియల్ షెడ్లను ఏర్పాటు చేయగా, స్థానికుల ఫిర్యాదుల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు నేలమట్టం చేశారు. కానీ, అధికారుల చర్యలను, చట్టాలను ఏమాత్రం బేఖాతరు చేయని ఆక్రమణదారులు, ల్యాండ్ మాఫియా అండతో మళ్లీ అదే స్థానంలో అంతకంటే భారీ షెడ్లను లేపారు. అంతటితో ఆగకుండా, ఈ మధ్యకాలంలో ఆ భూమిలో చిన్న చిన్న ఐరన్ బాక్సులు (క్యాబిన్లు) కూడా వెలిశాయి. ఇక్కడ గమనించాల్సిన ప్రధానమైన విషయం ఏమిటంటే, ఈ అక్రమ షెడ్లకు మున్సిపల్ లేదా రెవెన్యూ శాఖల నుండి ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు లేదా ఎలాంటి అభ్యంతర పత్రాలు లేవు. అయినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు ఈ భారీ షెడ్లకు, తాజాగా వెలిసిన చిన్న చిన్న ఐరన్ బాక్సులకు సైతం కమర్షియల్, ఇండస్ట్రియల్ అవసరాలకు వాడే భారీ 'త్రీఫేస్' కరెంట్ మీటర్లను మంజూరు చేసేశారు. ల్యాండ్ టైటిల్ స్పష్టంగా లేని వివాదాస్పద భూమిలో, నివాస ప్రాంతాల మధ్య ఇలాంటి భారీ కరెంట్ మీటర్లు ఏ ప్రాతిపదికన ఇచ్చారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. విద్యుత్ శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది ఆక్రమణదారులతో చేతులు కలిపి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సాధారణంగా విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడైనా కొత్త కరెంటు మీటరు ఇవ్వాలంటే కచ్చితంగా మున్సిపల్ మరియు రెవెన్యూ శాఖల నివేదికలను, అనుమతులను పరిశీలించాల్సి ఉంటుంది. అలా చేస్తే భవిష్యత్తులో భూ వివాదాలకు, అక్రమ ఆక్రమణలకు కొంతమేర అడ్డుకట్ట వేయవచ్చు. కానీ, కాప్రా సర్వే నంబర్ 11 లో అన్ని నిబంధనలను తుంగలో తొక్కారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మరియు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారులు స్పందించి, సర్వే నంబర్ 11 లో వెలిసిన భారీ ఇండస్ట్రియల్ షెడ్ల చట్టబద్ధతపై, వాటికున్న విద్యుత్ మీటర్ల లీగాలిటీపై సమగ్ర విచారణ జరపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా నిర్మించిన షెడ్లను వెంటనే తొలగించి, నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన కరెంట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతున్నారు.

# మత్తు వలయం నుంచి విముక్తి పొందాలి

- వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత
- డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన డీసీపీ

**మహా వరంగల్ క్రైం:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ధార కవిత శుక్రవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ మధుమిత తో మాట్లాడి, కేంద్రంలో అందిస్తున్న వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గంజాయి వ్యసనం నుంచి విముక్తి కోసం చికిత్స పొందుతున్న వారితో ఆత్మీయంగా మాట్లాడి, మాదక ద్రవ్యాలకు శాశ్వతంగా దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యుల సహకారం, వైద్యుల మార్గదర్శకత్వంలో వ్యసనాన్ని పూర్తిగా జయించి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. చికిత్స పొందుతున్న వారి మానసిక ఉల్లాసం, శారీరక మానసిక చైతన్యం సానుకూల దృక్పథాన్ని పెంపొందించే ఉద్దేశంతో వారికి ఇండోర్ గేమ్స్ కు



సంబంధించిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. డీఅడిక్షన్ సెంటర్ లో సేవలందిస్తున్న వైద్యులు, కౌన్సెలర్లు, సిబ్బంది చేస్తున్న సేవలను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో పోలీసు శాఖతో పాటు వైద్య ఆరోగ్య శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మట్వాడ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు ఇతర పోలీసు సిబ్బంది తో పాటు డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ సర్వే ను విజయవంతం చేయాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు

**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి పట్టణంలో ఎస్ ఐ ఆర్ సర్వేలో విజయవంతం చేసేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం నాడు బెల్లంపల్లి శాసనసభ్యులుగడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీ సుభాష్ నగర్ బస్తి, 7వ వార్డ్ లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వేను బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు ప్రారంభించి మాట్లాడుతూ ఎస్ఐఆర్ సర్వేను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.బి ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి సంబంధిత ఫారాలను పంపిణీ చేస్తారని, ఓటర్లు వాటిని పూర్తిగా నింపి తిరిగి అందజేయాలని సూచించారు.సర్వే ప్రక్రియలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి సర్వేను విజయవంతం చేయాలని కోరారు. అర్హులైన ఓటర్లు ఏ ఒక్కరి ఓటు హక్కును. ఎలాంటి పొరపాట్లు జరగకుండా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఓ లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 16 వార్డులో వార్డు కౌన్సిలర్ మత్తమారి రాయమల్లు బిఎల్ఓ పరమేశ్వరి తో కలిసి ఎస్ఐఆర్ సర్వే ఫారం లను సంబంధిత ఓటర్లకు అందజేసి ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఫారంను నింపి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అప్రమత్తమైన అధికారులు

**ప్రమాదకరంగా ఉన్న కొమ్మలను తొలగించిన హెచ్‌కెఆర్ సిబ్బంది**




**రామగుండం జూన్ 26 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం ఎన్టీపీసీ మెటీరియల్ గేట్ సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా పెరిగిన చెట్ల కొమ్మలను హెచ్‌కెఆర్ (HKR) సిబ్బంది గురువారం చెట్ల ను తొలగించారు. ఈ మార్గంలో రోడ్డుకు అడ్డంగా పెరిగిన కొమ్మల వల్ల వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పందించి చర్యలు తీసుకోవాలని కార్మికులు అధికారులకు విన్నవించిన విషయం తెలిసిందే.ప్రతిరోజూ సుమారు 4 వేల మందికి పైగా కార్మికులు రాకపోకలు సాగించే గోదావరిఖనికరీంనగర్ ప్రధాన రాజీవ్ రహదారిపై ఈ పరిస్థితి నెలకొంది. వాహనదారులు, కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, స్పందించిన హెచ్‌కెఆర్ సిబ్బంది వెంటనే ఆ చెట్ల కొమ్మలను నరికివేసి రహదారిని క్లియర్ చేశారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడమే కాకుండా, కార్మికుల ప్రయాణం సురక్షితంగా మారిందని స్థానికులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో స్పందించి చర్యలు తీసుకున్న అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## దిగ్గజ కంపెనీ కొత్త ప్లాన్.. లక్ష ఉద్యోగులు బయటకు!



జర్మనీకి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్.. అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే.. కంపెనీ సీఈఓ ఒలివర్ బ్లూమ్ ఆధ్వర్యంలో రూపొందుతున్న ఈ ప్రణాళికలో భారీ స్థాయిలో ఉద్యోగ కోతలు, ఫ్యాక్టరీల మూసివేత, పెట్టుబడుల తగ్గింపు వంటి కీలక నిర్ణయాలు ఉండే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. కంపెనీ కొత్త ప్రణాళిక ప్రకారం.. సుమారు లక్ష ఉద్యోగాల వరకు కోతలు ఉండే అవకాశం ఉంది. ఇది సంస్థలో పని చేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతం అని తెలుస్తోంది. అయితే కంపెనీ 50వేల మంది ఉద్యోగులను తొలగించడానికి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఫోక్స్ వ్యాగన్ తన పెట్టుబడి వ్యయాన్ని కూడా తగ్గించాలని చూస్తోంది. రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను సుమారు 15 శాతం తగ్గించి, మొత్తం 130 బిలియన్ యూరోలకు పరిమితం చేయాలని యోచిస్తోంది. ఆర్థిక ఒత్తిడిని తగ్గించుకోవడంలో భాగంగానే సంస్థ ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## భారత్‌లో కొత్త మోటార్ సైకిళ్ల తయారీ!

అమెరికాకు చెందిన ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్, భారతీయ ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి. ఇరు సంస్థలు కలిసి ఎంట్రీ లెవల్ పెర్ఫార్మెన్స్ మోటార్‌సైకిళ్లు, క్రూయిజర్ మోడళ్లను సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నాయి. వీటిని భారతదేశంలోనే తయారు చేస్తారు. ఇక్కడి నుండి అంతర్జాతీయంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు ఎగుమతి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.



### హార్లే 'బ్యాక్ టు బ్రిక్స్' వ్యూహం

2019 నుంచి 2025 మధ్య కాలంలో హార్లే డేవిడ్‌సన్ అంతర్జాతీయ రిటైల్ విక్రయాలు 40 శాతం తగ్గాయి. దీంతో కంపెనీ మార్జిన్లు 18% దెబ్బతిన్నాయి. డీలర్ల లాభాలు ఏకంగా 80% మేర క్షీణించాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు 'బ్యాక్ టు బ్రిక్స్' పేరుతో కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ప్లాట్‌ఫారమ్‌ల ఆధారంగా రాబోయే మూడేళ్లలో 20 కొత్త మోడళ్లు, వేరియంట్లను మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ప్రీమియం విభాగంలో మరింత విస్తృతంగా వినియోగదారులను చేరుకోవాలని కంపెనీ భావిస్తోంది.

### వ్యూహాత్మకంగా భారత్‌లోకి రీఎంట్రీ

హార్లే డేవిడ్‌సన్ 2011లో హర్యానాలోని బావల్‌లో ప్లాంట్ ఏర్పాటు చేసింది. నష్టాల కారణంగా 2019లో భారత్‌లో తయారీ కార్యకలాపాలను నిలిపివేసింది. తర్వాత 2020లో హీరో మోటోకార్ప్‌తో లైసెన్సింగ్, పంపిణీ ఒప్పందం కుదుర్చుకుంది. డీల్‌లో భాగంగా మోటార్‌సైకిళ్ల విక్రయం, సర్వీసింగ్‌తో పాటు సంయుక్తంగా కొత్త మోడళ్ల రూపకల్పన, తయారీ చేపట్టాలని నిర్ణయించారు. ఈ భాగస్వామ్యంలో తొలి ఉత్పత్తిగా వచ్చిన హెచ్‌డీ ఎక్స్440 ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.35 లక్షల నుంచి ప్రారంభమవుతోంది. ఇదే ప్లాట్‌ఫారమ్‌పై హీరో మావ్రిక్ పేరుతో మరో మోడల్‌ను విక్రయిస్తోంది. ఇప్పుడు ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ ఎగుమతుల దిశగా కీలక అడుగులు వేస్తోంది. వ్యాపారణ విస్తరణ వ్యూహంపై హార్లే డేవిడ్‌సన్ స్పందిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తమ బ్రాండ్ విస్తరణకు హీరో మోటోకార్ప్ కీలక భాగస్వామి అని పేర్కొంది. అయితే కొత్త ఉత్పత్తులపై పూర్తి వివరాలను వెల్లడించలేదు. మరోవైపు హీరో మోటోకార్ప్ సీఈఓ హర్షవర్ధన్ చితాలే మాట్లాడుతూ, ఈ ఏడాది మరిన్ని హార్లే బ్రాండెడ్ మోటార్‌సైకిళ్లు విడుదలవుతాయని ధృవీకరించారు. గ్లోబల్ మార్కెట్లలో అనుకూలత ఉంటే భారత్‌లో తయారైన మోడళ్లను ఇతర దేశాల్లో విక్రయించే నిర్ణయం పూర్తిగా హార్లే-డేవిడ్‌సన్‌దేనని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎక్స్440, హీరో మావ్రిక్ మోడళ్లు కలిపి దేశంలో 14,375 యూనిట్లు అమ్ముడయ్యాయి. 350సీసీ 500సీసీ విభాగంలో సుమారు 11 శాతం మార్కెట్ వాటాతో, హీరో మోటోకార్ప్ ప్రస్తుతం బజాజ్ ఆటో, రాయల్ ఎన్‌ఫీల్డ్ తర్వాత మూడో అతిపెద్ద సంస్థగా నిలిచింది. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం, ఈ ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో ఆపరేటింగ్ మార్జిన్లు సాఫ్ట్‌వేర్ ఎగుమతుల కంటే అధికంగా ఉండటం గమనార్హం.

### ఏడాది చివర్లో 'హార్లే–డేవిడ్‌సన్ స్ప్రింట్'

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న హార్లే–డేవిడ్‌సన్ ఎక్స్440, హీరో మావ్రిక్ మోడళ్లకు మంచి ఆదరణ లభించడంతో ప్రస్తు ఆర్థిక సంవత్సరంలో మరిన్ని కొత్త మోడళ్లను విడుదల చేయాలని ఇరు సంస్థలు నిర్ణయించాయి. వీటిలో తొలి మోడల్‌గా 'హార్లే–డేవిడ్‌సన్ స్ప్రింట్' ఈ ఏడాది చివర్లో మార్కెట్లోకి వచ్చే అవకాశముంది. అనంతరం దశలవారీగా మరిన్ని మోడళ్లను ప్రవేశపెట్టనున్నారు. వీటిలో కొన్ని మోడళ్లను భారత్ నుంచి తొలిసారిగా అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నట్లు పరిశ్రమ వర్గాల సమాచారం.

## హైదరాబాద్‌లో టాటా ఈవీ మెగాచార్జర్ హబ్

భారతదేశపు అగ్రగామి ఇంటిగ్రేటెడ్ పవర్ కంపెనీ అయిన 'టాటా పవర్', దేశంలోనే అతిపెద్ద ఫోర్ వీలర్ ఈవీ తయారీ సంస్థ 'టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్'తో జతకట్టింది. ఈ రెండు సంస్థలు కలిసి తెలంగాణలోనే మొట్టమొదటి హైస్పీడ్ 'టాటా. ఈవీ మెగాచార్జర్ హబ్'ను హైదరాబాద్‌లోని ఐలాబ్స్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రారంభించాయి. హైటెక్ సిటీ నడిబొడ్డున వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ ఐలాబ్స్ చార్జింగ్ హబ్.. హైదరాబాద్‌లో వేగంగా పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహన వినియోగదారుల అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా రూపొందించింది. సొంత ఈవీ కార్లు ఉన్నవారు, కమర్షియల్ ఫ్లీట్ నిర్వాహకులు, రైడ్ హెయిలింగ్ సర్వీసులు, నగరాల మధ్య ప్రయాణించే వారు, కార్పొరేట్ ఉద్యోగులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. హైదరాబాద్ నగరం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ అండ్ బిజినెస్ హబ్‌గా ఎదుగుతున్న తరుణంలో.. నమ్మకమైన, వేగవంతమైన ఈవీ చార్జింగ్ మౌలిక సదుపాయాల డిమాండ్‌ను తీర్చడంతో పాటు, రాష్ట్ర పర్యావరణ లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశ్యం. మొత్తం 360 కిలోవాట్స్ చార్జింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ మెగాచార్జర్ హబ్‌లో మూడు 120 కిలోవాట్ల డిస్పెన్సర్లు ఉన్నాయి. వీటి సహాయంతో ఒకే సమయంలో ఆరు ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ చేయవచ్చు. 24 గంటలూ పనిచేసే ఈ సదుపాయం వల్ల చార్జింగ్ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే కస్టమర్లకు ఎటువంటి ఇబ్బంది లేని, నమ్మకమైన చార్జింగ్ అనుభూతి లభిస్తుంది.




## ఒక్కసారిగా పెరిగిన గోల్డ్ రేటు!

భారతదేశంలో వరుసగా తగ్గుముఖం పడుతున్న బంగారం ధరలకు బ్రేక్ పడింది. ఎందుకంటే ఈ రోజు (జూన్ 26) గోల్డ్ రేటు ఊహకందని రీతిలో ఒక్కసారిగా పెరిగింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లోని పసిడి ధరల్లో మార్పు జరిగింది. ఈ కథనంలో తాజా ధరల వివరాలు చూసేద్దాం. హైదరాబాద్, విజయవాడలలో శుక్రవారం ఉదయం రూ.250 పెరిగి రూ.1,29,800 వద్ద ఉన్న 22 క్యారెట్ల తులం బంగారం రేటు.. సాయంత్రానికి రూ.1,30,850 వద్దకు చేరింది. అంటే గంటల వ్యవధిలో రూ.1050 పెరిగింది. 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,41,600 నుంచి రూ.142750 వద్దకు చేరింది. ఢిల్లీలో కూడా గోల్డ్ ధరలో మార్పులు కనిపించాయి. దేశ రాజధానిలో 22 క్యారెట్ల తులం బంగారం ధర ఉదయం నుంచి సాయంత్రానికి రూ.1,29,950 నుంచి



రూ.1,31,050 వద్దకు (రూ.1100 పెరిగింది) చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల రేటు 1,41,750 రూపాయల నుంచి 1,42,950 రూపాయల వద్దకు చేరింది. చెన్నైలో మాత్రం 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1,33,000 (రూ.1600 పెరిగింది) వద్ద, 24క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,45,090 (రూ.1740 పెరిగింది) వద్ద నిలిచింది.




# దేశం-విదేశం


NATIONAL-INTERNATIONAL



## కేతన్ అగర్వాల్ కేసులో కొత్త మలుపు

**పుణెకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ తండ్రి విశాల్ అగర్వాల్ ఇవాళ(శుక్రవారం) మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి.. తన కుమారుడి హత్యకు కారణమైన నిందితులకు ఉరిశిక్ష విధించాలని కోరారు. మరోవైపు, తన కుమారుడు తలకు విగ్గు (కృత్రిమ జుట్టు) వాడుతున్నాడనే కారణంతోనే ఈ హత్య జరిగిందనే ఆరోపణలను ఆయన తండ్రి విశాల్ అగర్వాల్ ఖండించారు. నిశ్చితార్థానికి చాలా కాలం ముందే తన కుమారుడికి ఉన్న స్వల్ప జుట్టు రాలే సమస్య గురించి సియా గోయల్, ఆమె కుటుంబ సభ్యులతో బహిరంగంగానే చర్చించామన్నారు.**





కేతన్‌కు తలపై ఒక చిన్న భాగంలో జుట్టు రాలింది. కానీ వివాహం ఖాయం కావడానికి ముందే ఈ విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేశామని విశాల్ అగర్వాల్ అన్నారు. కాగా, కేతన్ అగర్వాల్ విగ్ పెట్టుకోవడం సియా గోయల్‌కు నచ్చలేదని ఓ పోలీసు అధికారి పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. అగర్వాల్ విగ్ పెట్టుకున్న మాట నిజమే.. కానీ సియాకు అతను నచ్చకపోవడానికి అది ఒక్కటే కారణమని చెప్పలేమని ఆ అధికారి పేర్కొన్నారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులు మాట్లాడుతూ.. జూన్ 18న లోహగడ్ కోటపై నుండి చౌదరి.. అగర్వాల్‌ను కిందకు నెట్టేయడానికి ముందు.. గోయల్ ముందుగా అనుకున్న ప్రకారం ఒక సంకేతాన్ని (సిగ్నల్) ఇచ్చిందని తెలిపారు. ఈ ఇద్దరూ పారిపోతే తమ కుటుంబాల ప్రతిష్ట దెబ్బతింటుందనే భయంతో కేతన్ అగర్వాల్‌ను చంపేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. మొదట ఇద్దరూ ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడానికి ప్రయత్నించారు. విచారణ సమయంలో నేరస్థులలో ఇలాంటి ధోరణి సాధారణంగా కనిపిస్తుంది. అయితే.. చివరకు తానే ఈ కుట్ర పన్నానని.. ఇందులో చేతన్ ప్రమేయం కూడా ఉందని సియా అంగీకరించిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. చౌదరి మొదట మాట్లాడుతూ.. తాను కోట వద్దే ఉన్నానని.. అయితే అగర్వాల్‌ను నెట్టేసిన ప్రదేశానికి తాను వెళ్లలేదని.. అసలు అక్కడ ఏం జరిగిందో తనకు తెలియదని వాదించాడు. అయితే, అతను అబద్ధం చెబుతున్నాడని స్పష్టంగా తెలిసిందన్న అధికారి.. ఆ తర్వాత ఇద్దరు నిందితులూ తమ తప్పును అంగీకరించి.. ఘటన ఎలా జరిగిందో వివరించారని తెలిపారు. అగర్వాల్, గోయల్‌ల వివాహం నవంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న ఒక ప్యాలెస్‌లో జరగాల్సి ఉంది. ఈ నేరానికి బాధ్యులైన వారికి కఠిన శిక్ష పడాలని గోయల్ తండ్రి కూడా కోరారు. ఇందులో తన కూతురి ప్రమేయం ఉన్నా సరే, ఆమెకు కూడా అదే శిక్ష పడాలన్నారు. కేతన్ నాకు కొడుకు లాంటివాడు.. అతని మరణం మా రెండు కుటుంబాలను విషాదంలో ముంచేసింది. మేము పెళ్లి పనుల్లో ఎంతో ఆత్రుతగా ఉన్నాం. జరిగినదంతా చాలా విషాదకరం. ఈ రోజుకీ మేము దీన్ని నమ్మలేకపోతున్నాం'' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సియా సంబంధాల గురించిన నిజాలను గోయల్ కుటుంబం దాచిపెట్టిందన్న అగర్వాల్ తండ్రి ఆరోపణలను ఆయన ఖండించారు. వారి మధ్య ఎలాంటి విభేదాలు ఉన్నాయనే విషయం కానీ.. సియాకు మరొకరితో సంబంధం ఉందనే విషయం కానీ తమకు తెలియదని ఆయన చెప్పారు. కాగా, సీఎం ఫడ్నవీస్ ఈ ఘటనను అత్యంత దిగ్భ్రాంతికరంగా అభివర్ణించారు. ఈ ఘటనను ఒక నేరంగానే కాకుండా.. సమాజం లోతుగా ఆలోచించాల్సిన విషయంగా చూడాలన్నారు. చదువుకుని, సమాజంలో మంచి స్థితిలో ఉన్న కుటుంబాల పిల్లల్లో ఇలాంటి ద్వేషపూరిత, వినాశకరమైన ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి? ఈ మానసిక స్థితి వెనుక ఉన్న కారణాలు ఏమిటి? దీనిపై మనం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

## తొలిసారి భారత్‌కు జపాన్ ప్రధాని


**ఢిల్లీ:** జపాన్ ప్రధాని సనాయే తకాయిచి వచ్చే నెల(జులై) 1 నుంచి 3 వరకు భారత్ పర్యటనకు రానున్నారు. 16వ భారత్‌జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఆమె పాల్గొననున్నారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) వెల్లడించింది. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించి, మరింత బలోపేతం చేసేందుకు చర్చలు జరగనున్నాయి. అలాగే ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన అభిప్రాయాలను కూడా రెండు దేశాల నాయకులు పంచుకోనున్నారు. జపాన్ ప్రధాని హోదాలో సనాయే తకాయిచి భారత్‌కు రావడం ఇదే తొలిసారి. గత ఏడాది ఆగస్టులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టోక్యోలో జరిగిన 15వ భారత్‌జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఆ పర్యటన అనంతరం ఇప్పుడు తకాయిచి భారత పర్యటన చేపట్టడం, భారత్‌జపాన్ మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలన్న ప్రధాన అజెండాగా ఈ భేటీ సాగనుంది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వం వంటి అంశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై నేతలు చర్చించనున్నట్లు సమాచారం.



## తండ్రి చివరి కోరిక....

### వీడియో కాల్‌లోనే పెళ్లి, అంతలోనే..!

ఒకవైపు కన్నకూతురి పెళ్లి కళ్లారా చూడాలన్న కన్నతండ్రి కోరిక, మరవైపు అనూహ్యంగా తీవ్ర అనారోగ్యం బారిన తండ్రి. చివరికి ఆసుపత్రి బెడ్‌పై నుంచే వీడియో కాల్లో కూతురి పెళ్లి చూసి సంతోషంగా ఆనంద బాష్పాలు రాల్చాడు. కానీ అంతలోనే తీవ్ర విషాదం అలుముకుంది. బిహార్‌లోని సీతామఢీ జిల్లా సోన్‌బర్సాకు చెందిన లాల్‌బాబు మహతో ఒక ట్రావెల్ కంపెనీలో బస్సు కండక్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. తన చిన్న కూతురు నిధి కుమారి వివాహాన్ని ఘనంగా జరిపించాలని ఎన్నో కలలు కన్నారు. ఈ శుభఘడియ కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. అయితే పెళ్లికి సరిగ్గా మూడు రోజుల ముందు ఆయన ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. దీనితో ఆయన్ను లక్నోలోని ఒక ఆసుపత్రిలో చేర్చారు. లాల్‌బాబు మహతో చివరి కోరిక తీర్చేందుకు కుటుంబ సభ్యులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన భార్య మీనూ దేవి, కుమారుడు రాజేష్ కలిసి ఆసుపత్రి నుండే వీడియో కాల్ ద్వారా నిధి పెళ్లి చూసే ఏర్పాటు చేశారు. అలా కూతురి వివాహ వేడుకను ఆసుపత్రి బెడ్‌పై నుండి వీడియో కాల్ ద్వారా వీక్షించారు. ప్రతి ముఖ్యమైన ఘట్టాన్ని హల్దీ వేడుక, పూలదండలు మార్చుకోవడం, ప్రధాన వివాహ ఘట్టం వరకు వీడియో కాల్ ద్వారా ప్రత్యక్షంగా చూసి తన కోరిక నెరవేర్చుకున్నారు. కొత్త పెళ్లికూతురిగా కుమార్తె అలా అత్తగారింటికి వీడ్కోలు తీసుకున్న మరుక్షణమే ఒక తండ్రి గుండె ఆగిపోయింది. ఆసుపత్రి నుండే వీడియో కాల్ ద్వారా ఆమె కూతురి వీడ్కోలు వేడుక ముగిసి, ఇల్లు వదిలి వెళ్తుండగా ఆ తండ్రి కళ్ల





వెంట నీళ్లు తిరిగాయి. అలాగా చివరి శ్వాస విడిచారు. ఈ ఊహించని పరిణామం కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది కంట కన్నీరు తెప్పించింది.

### ఒకేరోజు చెల్లి పెళ్లి.. తండ్రి మరణం

లాల్‌బాబు కుమారుడు రాజేష్ కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ఒకవైపు చెల్లి వీడ్కోలును, మరోవైపు తండ్రి మరణాన్ని చూడాల్సి వచ్చింది. నిధి సీతామఢీ జిల్లాలోని మోహన్‌పూర్‌కు చెందిన తన భర్తతో కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అత్తగారింటికి బయలుదేరి వెళ్లడం, మరోవైపు తండ్రి ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోవడంతో ఆ అన్న ఆవేదనకు అంతులేకుండా పోయింది. లాల్‌బాబు మహతోకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## రాహుల్‌పై బీజేపీ మీమ్స్ వార్.. కాంగ్రెస్ కౌంటర్

**ఢిల్లీ:** రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ మరో డిజిటల్ వార్ మొదలుపెట్టింది. రాహుల్ విదేశీ పర్యటనలపై మీమ్స్‌తో పోస్టులు పెడుతూ.. విమర్శలు గుప్పిస్తోంది. రాహుల్ గాంధీ ఎక్కడున్నారు? ఆయన తరచూ చేసే విదేశీ పర్యటనలకు అయ్యే ఖర్చు ఎక్కడి నుంచి వస్తోందంటూ నిలదీసింది. బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ పార్టీ కౌంటర్ ఇస్తూ.. రాహుల్ గాంధీ గ్లోబల్ లీడర్ అని.. అనేక దేశాలు, సంస్థలు ఆయనను ఆహ్వానిస్తుంటాయంటూ పేర్కొంది. ప్రముఖ సినిమా టైటిళ్ల ఆధారంగా రూపొందించిన 'ఛడ్ దే ఇండియా' (ఇండియాను వదిలేయ్), 'లాపతా రాహుల్' (కనిపించకుండా పోయిన రాహుల్) పోస్టర్లతో బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. గో రాహుల్ గాన్, టూరిస్ట్ జిందా హై, పరదేశ్ వంటి మరికొన్ని పోస్టర్లు కూడా వైరల్‌గా మారాయి. రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది




ఆయనను కలవాలని అనుకుంటున్నారని స్పష్టం చేసింది. ఆయన చాలా తక్కువ సమయం మాత్రమే కేటాయించగలరు కాబట్టి, ఆయన పర్యటనలు చిన్నవిగా, తరచుగా ఉంటాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు. "రాహుల్ గాంధీ కేవలం మన దేశానికి మాత్రమే నాయకుడు కాదు. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఆయనను ఒక గొప్ప నాయకుడిగా భావిస్తారు. చాలా మంది ఆయన కోసం ఎదురుచూస్తున్నారు. ఈ వరుస ఆహ్వానాల కారణంగా ఆయన కేవలం రెండు రోజులు, నాలుగు, ఐదు రోజులు మాత్రమే సమయం కేటాయించి ప్రయాణిస్తున్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరూ బీజేపీతో ఏకీభవించరని గ్రహించాలి. ప్రజలు భారతదేశాన్ని విభిన్న కోణాల్లో చూస్తారు, ఆ కోణంలోనే వారు రాహుల్ గాంధీని కూడా చూస్తారు" అని ఖుర్షీద్ పేర్కొన్నారు. విదేశీ పర్యటనలు చేయవద్దని ప్రజలకు పిలుపునిచ్చిన వెంటనే స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా విదేశాలకు వెళ్లారని కాంగ్రెస్ ఎంపీ మనోజ్ కుమార్ గుర్తు చేశారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్తే తప్పేంటి? విదేశాలకు వెళ్లవద్దన్నా ప్రధాని.. ఆ తర్వాత తనే స్వయంగా విదేశీ పర్యటనకు వెళ్తారు. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడంటూ ఆయన సమర్థించారు.



## అతన్ని కొట్టాను.. ఇప్పటికీ బాధపడుతున్నా...

**అలియా భట్**

సినిమాల్లో ఒకప్పుడు యాక్షన్ సన్నివేశాలు కేవలం హీరోలు మాత్రమే చేసేవాళ్లు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. హీరోయిన్లు సైతం గాల్లోకి ఎగిరి ఫైట్ చేస్తున్నారు. రెండు చేతుల్లో గన్స్ పట్టి ఫైర్ కూడా చేస్తున్నారు. అలాంటి చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అందుకే అందాల భామ అలియా భట్ కూడా హైవోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌తో అలరించడానికి రెడీ అవుతుంది. ఆమె ప్రధాన పాత్రలో, శివ్ రావేల్ తెరకెక్కించిన చిత్రం 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అలియా.. ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. ఈ సినిమాలోని యాక్షన్ సీన్ల కోసం ప్రాక్టీస్ చేస్తున్న సయమంలో ఓ కొరియోగ్రాఫర్‌ని కొట్టానని చెప్పింది. అలా కొట్టినందుకు ఇప్పటికీ బాధ పడుతున్నానని అలియా తెలిపింది. 'ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో అనుకోకుండా అతన్ని కొట్టాను. వెంటనే సారీ కూడా చెప్పాను. కానీ నా వల్ల ఒకరికి దెబ్బ తగిలినందుకు చాలా బాధేసింది. ఇప్పటికీ అది గుర్తొచ్చినప్పుడల్లా బాధపడతాను. యాక్షన్ సీక్వెన్స్ తెరపై సహజంగా చూపించడానికే అలా ప్రాక్టీస్ చేశాం. ఆల్ఫాలో యాక్షన్ కొరియోగ్రఫీ అద్భుతంగా ఉంటుంది. నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతిని ఈ చిత్రం ఇచ్చింది' అని అలియా చెప్పకొచ్చింది. ఇక ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన బాబీ డియోల్ కూడా అలియా యాక్షన్ సీన్స్ చూసి భయపడిపోయానని చెప్పాడు. అలియా చాలా సన్నగా ఉంటారని.. ఎక్కడ దెబ్బ తగులుతుందోననే భయంతో జాగ్రత్తగా షూటింగ్ చేశామని ఆయన చెప్పుకొచ్చాడు.

## హీరోగా ఎంట్రీ ఇస్తున్న ప్రముఖ సంగీత దర్శకుడు కొడుకు

ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు, నటుడు వందేమాతరం శ్రీనివాస్ తనయుడు సుస్వర తరంగ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ రొమాంటిక్ థ్రిల్లర్ సినిమాలో దివ్యాని మొండల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, వీరేష్ కోకా దర్శకత్వంలో పి. చక్రధర రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి గంటా రవితేజ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు డాలీ క్లాప్ ఇచ్చి, గౌరవ దర్శకత్వం వహించారు. నల్లమలుపు బుజ్జి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించారు. ఈ కార్యక్రమంలో 'వందేమాతరం' శ్రీనివాస్ మాట్లాడుతూ- "నేను 275కి పైగా సినిమాలకు పనిచేశాను. ప్రేక్షకులు నాకు ఎంతో ప్రేమ, అభిమానాన్ని అందించారు. ఇప్పుడు ఈ సినిమాతో మా అబ్బాయి హీరోగా పరిచయం అవుతున్నాడు. ప్రస్తుత యువత ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించే కథ ఇది.

మంచి కాన్సెప్ట్‌తో దర్శక-నిర్మాతలు చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతం అవుతుంది. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాను" అన్నారు. "నా తొలి సినిమాకే ఇంత మంచి అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు సుస్వర తరంగ్. "నిజ జీవితం ఆధారంగా రూపొందిస్తున్న మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్ సినిమా ఇది. శ్రీనివాస్‌గారు ఇచ్చిన బాధ్యతను నిలబెట్టుకుంటాను" అన్నారు వీరేష్ కోకా.



## విజయ్ దేవరకొండపై రూమర్స్.. స్పందించిన మైత్రి నిర్మాత



గత రెండు రోజులుగా హీరో విజయ్ దేవరకొండ రణబాలి మూవీపై రూమర్స్ వినిపిస్తున్నాయి. హీరో విజయ్ నిర్మాతలకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాజాగా ఈ రూమర్స్‌పై మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత యలమంచిలి రవి స్పందించారు. అలాంటి వార్తలు పూర్తి ఫేక్ అని కొట్టిపారేశారు. షూటింగ్ సమయంలో మాకు ఎలాంటి ఇబ్బందులు రాలేదని వెల్లడించారు. విజయ్ కేవలం పని మీదే శ్రద్ధ పెడతారని రవి క్లారిటీ ఇచ్చారు. కాగా.. రణబాలి షూట్ కోసం విజయ్ ఎక్కువగా కారవాన్లు డిమాండ్ చేయడమే కాకుండా.. అసిస్టెంట్స్ కూడా ఎక్కువ మంది ఉండాలని కోరాడని వార్తలొచ్చాయి. ఇప్పటికే ఈ విషయంపై విజయ్ టీమ్ కూడా స్పందించింది. ఇలాంటి ఫేక్ న్యూస్ రాసేవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ప్రకటన విడుదల చేశారు.

కాగా.. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రణబాలి మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా కనిపించనుంది. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకుంది. కీలక సన్నివేశాలను రాయలసీమలోని చారిత్రక ప్రాంతాల్లో తెరకెక్కించారు. బ్రిటిష్ కాలం నాటి స్టోరీ కావడంతో అందుకు తగ్గట్టుగానే షూట్ చేస్తున్నారు.




## తెలంగాణలో జరిగిన వాస్తవ ఘటనలతో సర్కారు బాయి

శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు హీరో శ్రీరామ్ నిమ్మల పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తెలంగాణ పల్లె యువకుడిగా ఎంతో సహజంగా శ్రీరామ్ నిమ్మల కనిపిస్తున్నారు. ప్రస్తుతం "సర్కారు బాయి" సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 17వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి అనే ఊరిలో "సర్కారు బాయి" చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ లెంగ్తీ షెడ్యూల్ లో సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, ముఖ్య నటీనటులు బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లపై సీన్స్ షూటింగ్ చేస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

## సమంత ప్రెగ్నెన్సీ సీక్రెట్.. నాకు మాత్రమే తెలుసు



సమంత ఇటీవలే అభిమానులకు డబుల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. మా ఇంటి బంగారం మూవీతో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. నందిని రెడ్డి డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అంతే కాకుండా తాను ప్రెగ్నెన్సీతో ఉన్నానని మరో గుడ్ న్యూస్ పంచుకుంది. ఈ ప్రకటనతో సామ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా డైరెక్టర్ నందిని రెడ్డి మరో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాజాగా ఓ ఛానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో సమంత ప్రెగ్నెన్సీపై ఆమె మాట్లాడారు. మా ఇంటి బంగారం షూటింగ్‌లో ఉన్నప్పుడే సామ్‌కు ప్రెగ్నెన్సీ కన్‌ఫామ్ అయిందని నందని రెడ్డి తెలిపింది. ఈ విషయం సెట్‌లో కేవలం నాకు మాత్రమే తెలుసని పేర్కొంది. కానీ అప్పటికే యాక్షన్ సీన్స్ మొత్తం కంప్లీట్ చేశామని నందిని వెల్లడించింది. అందువల్ల షూటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది రాలేదని వివరించింది. మిగిలిన షూట్‌కి సమంతకి కొంచెం ఎక్కువ విశ్రాంతినిస్తూ పూర్తి చేశామని నందిని రెడ్డి చెప్పుకొచ్చింది.

కాగా.. మా ఇంటి బంగారం మూవీకి నందిని రెడ్డి దర్శకత్వం వహించగా.. సమంత తన సొంత బ్యానర్‌లో నిర్మించారు. ఈ మూవీకి సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో యాంకర్ శ్రీముఖి కీలక పాత్రలో కనిపించింది. ప్రస్తుతం ఈ సినిమా థియేటర్లలో సందడి చేస్తోంది.



## అజిత్ కొత్త సినిమా.. అదొక్కటే సమస్యగా మారిందా..!


సినిమాల వల్ల నిర్మాతలకు లాభమా? నష్టమా? అన్న ప్రశ్నకు రకరకాల బదులు వస్తుంది. ఒక పక్క చిత్ర పరిశ్రమ పీకల్లోతు కష్టాల్లో నెట్టబడుతోంది అనే వేదన వినిపిస్తోంది. మరో పక్క కోట్లు కొల్లగొడుతున్నాయి అనే ప్రచారాన్ని ఊదరగొడుతుండం చూస్తూనే ఉన్నాం. అంతే కాకుండా కొత్త నిర్మాతలు వస్తూనే ఉన్నారు. చిత్రాలు రూపొందిస్తూనే ఉన్నారు. ఇక ఇటీవల స్టార్ హీరో హీరోయిన్‌ల చిత్రాలు లాభాల్లో షేర్ విధానంలో నటించాలనే డిమాండ్ నిర్మాతల మండలి నుంచి పెరుగుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ నటించి ఏడాదిన్నర అవుతోంది. గతేడాది వచ్చిన గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం తర్వాత మరో చిత్రం ప్రారంభం కాలేదు. ఆయన 64వ చిత్రానికి దర్శకుడు అధిక్ రవిచంద్రన్ కథను సిద్ధం చేసి చాలా నెలలే అయ్యింది. త్వరలోనే చిత్రం సెట్ పైకి వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నిర్మాత ఎవరన్న విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ఈ చిత్రాన్ని రోమియో పిక్చర్స్ సంస్థ అధినేత రాహుల్ నిర్మించడానికి ముందుకు వచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే సమస్య అంతా అజిత్ రెమ్యునరేషన్‌తో అనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. అజిత్ రూ.180 కోట్లు పారితోషికం డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంత పారితోషికం ఇస్తే చిత్రం వర్కౌట్ కాదని రోమియో పిక్చర్స్ అధినేత రాహుల్.. అజిత్‌ను రెమ్యునరేషన్ తగ్గించుకోవాలని కోరినట్లు సమాచారం. అయితే ఆయన విజ్ఞప్తిని అజిత్ నిరాకరించారన్న టాక్ కోలీవుడ్‌లో వైరల్‌గా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో నటుడు అజిత్ తన తదుపరి చిత్రాన్ని తానే నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు తాజాగా ప్రచారం జోరందుకుంది. ఇందులో నిజం ఎంతో తెలియదు కానీ నెట్టింట తెగ వైరలవుతోంది. ప్రస్తుతం అజిత్ కుమార్ కారు రేసులతో బిజీగా ఉన్నారు. రేస్ పూర్తయ్యాక చెన్నైకి తిరిగి వచ్చిన తరువాత అజిత్ కొత్తగా చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించి స్వీయ నిర్మాణంలో చిత్రం చేయనున్నట్లు ప్రచారమైతే జరుగుతోంది. మరి అజిత్ నిర్మాతగా మారతాడా లేదా అన్నది తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

## బాహుబలి పార్ట్-3.. అభిమానులకు రాజమౌళి సర్‌ప్రైజ్



బాహుబలి సినిమాలతో దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇండియన్ సినీ చరిత్రలో తన పేరు లిఖించుకున్నారు. ఈ రెండు సినిమాలు వసూళ్లు మాత్రమే కాదు.. ఇండియన్ మూవీ మేకింగ్ ముఖచిత్రాన్నే మార్చేశాయి. ఈ రెండు పార్టులు బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో పార్ట్3 కూడా ఉంటుందని సినీ ప్రియులు భావించారు. ఇప్పటికే పలుసార్లు ఈ విషయంపై రాజమౌళి ఇంటర్వ్యూల్లో మాట్లాడారు. భవిష్యత్తులో పార్ట్3 ఉంటుందని అన్నారు. ఇవాళ బాహుబలి పార్ట్3పై అఫీషియల్ ప్రకటన వచ్చేసింది. దీనిపై నెట్‌ఫ్లిక్స్ ఓ వీడియోను రిలీజ్ చేసింది. బాహుబలి: ది టార్చ్ బేరర్ మూవీ స్ట్రీమింగ్‌కు ముందు ప్రభాస్, అనుష్క, రానాలతో కూడిన వీడియోను పంచుకుంది. ఇందులో రాజమౌళి సార్ లేకపోయినా కూడా ఈ విషయాన్ని చెప్పేస్తున్నానంటూ రానా పార్ట్3 ఉందని రివీల్ చేశారు. దీంతో బాహుబలి పార్ట్3పై అఫీషియల్ ప్రకటన వచ్చేసింది. ఈ ప్రకటనలో ప్రభాస్, రానా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. ఇవాళ బాహుబలి: ది టార్చ్ బేరర్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది.

## ఐటమ్ అనడం కరెక్ట్ కాదు..



మిల్కీ బ్యూటీ తమన్నా ఇటీవలే సౌత్ ఇండస్ట్రీపై కామెంట్స్‌తో వార్తల్లో నిలిచింది. సౌత్ సినిమాలలో మహిళలను చూసే కోణంలో పురుషాధిక్యత కనిపిస్తుందని కామెంట్స్ చేసింది. హీరోయిన్లను గౌరవప్రదంగా కాకుండా ఎక్కువగా గ్లామర్ కోణంలోనే చూపిస్తారని విమర్శించింది. అయితే బాలీవుడ్‌లో మాత్రం నటన లేదా గ్లామర్ ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుంది. కానీ సౌత్‌లో ఈ రెండింటినీ సమతుల్యం చేయాల్సి వస్తుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే ఈ ప్రస్తుతం సినిమాలు చేయకపోయినా.. ఐటమ్ సాంగ్స్‌లో అప్పుడప్పుడు తెరపై సందడి చేస్తోంది. జైలర్ మూవీలో ప్రత్యేక సాంగ్‌తో ఆకట్టుకున్నారు. ఈ పాటతో పాట మరిన్ని సినిమాల్లో ఐటమ్ సాంగ్స్ చేశారు ముద్దుగుమ్మ. అలా తన అందాలతో ఆకట్టుకున్న బ్యూటీ తమన్నా.. ఐటం సాంగ్స్‌పై ఉన్న అభిప్రాయాన్న తప్పుబట్టింది. అలాంటి పాటలను ఐటెం సాంగ్స్ అనడాన్ని తనకు నచ్చడం లేదని అన్నారు. సినిమాల్లోని స్పెషల్ సాంగ్స్‌ను ఐటమ్ సాంగ్స్ అనడం కరెక్ట్ కాదని తెలిపింది. అలాంటి పదం మహిళలకు మర్యాదకరమైనది కాదని తమన్నా పేర్కొంది. ఆ ఒక్క పాట కోసం మేం ఎంత కష్టపడున్నామో అందరికీ తెలుసని తమన్నా అన్నారు. అలాంటి పాటను ఐటెం సాంగ్ అనడం వల్ల.. నటి శ్రమకు ఇచ్చే గౌరవం కాదని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ విధానంలో మార్పు రావాలి.. నటీమణులను గ్లామర్ డాల్స్‌గా చూడకుండా వారి నటనా ప్రతిభకు ప్రాముఖ్యత ఇవ్వాలని తమన్నా పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com